## విలేకరులు కావలెను

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

"ప్రజా శంఖారావం" తెలుగు దినపత్రిక.

సంప్రదించాల్సిన చిరునామా..

నిజామాబాద్ సెల్ : 9440731515



epaper.prajashankaravam.com

తెలుగు డైలీ ఈ-పేపర్

RNI NO: TELTEL/2022/85170

# ప్రజా శంఖారావం

తెలుగు దిన పత్రిక

ప్రతి అక్షరం.. ప్రజా స్వరం..

PRAJA SHANKARAVAM TELUGU DAILY

పేజీలు 8

శుక్రవారం 11.09.2026 | సంపుటి: 04 | సంచిక: 113 | వెల: రూ. 3/- | ఎడిటర్: పుట్టి మురళి

హైదరాబాద్ | ఆదిలాబాద్ | నిర్మల్ | నిజామాబాద్ | కామారెడ్డి | జగిత్యాల | మంచిర్యాల | సిద్దిపేట్ | రాజన్న సిరిసిల్ల | సంగారెడ్డి | మెదక్


## రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

- ఫేక్ ఎక్స్ ఖాతాతో సభను తప్పుదోవ పట్టించారు?
- కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగించారని ఆరోపణ
- రూల్ 168 కింద నోటీసులు
- స్పీకర్‌కు కూడా బీఆర్ఎస్ ఫిర్యాదు

2

## కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

- మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో నమోదు!
- అసెంబ్లీ గేట్ వద్ద టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా నిరసన చేశారంటూ ఫిర్యాదు
- విధులకు ఆటంకం, బెదిరింపులకు పాల్పడ్డారని ఆరోపణ
- మహిళా కమిషన్‌ను ఆశ్రయించిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

2

## స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

- తాతా మధు, నవీన్‌రెడ్డి బెయిల్ రద్దుకు పోలీసుల పిటిషన్
- నిబంధనలు ఉల్లంఘించారని నాంపల్లి కోర్టుకు నివేదిక
- అట్రాసిటీ చట్టం వర్తిస్తుందని పోలీసుల వాదన
- రాజకీయ కక్షసాధింపేనంటున్న బీఆర్ఎస్

4



# సభను అడ్డుకోవడానికి ఫామ్ హౌజ్‌లో కుట్ర

- వెయ్యి రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలు వివరించడమే సభ లక్ష్యం
- మూడు రోజులు సభ జరగకుండా అడ్డుకున్నారు
- ప్రజాప్రతినిధులను దూషించారు
- అధికారులపై అనుచితంగా ప్రవర్తించారు
- దళితులు నడిచిన నేలను శుద్ధిచేసి అవమానించారు
- జరిగిన సంఘటనలపై విచారణ
- సీఎల్‌పీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఫామ్ హౌస్ లో కేసీఆర్ అధ్యక్షతన సభను సజావుగా జరగకుండా కుట్ర చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నిర్వహించిన సీఎల్‌పీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించడమే సభ నిర్వహణ లక్ష్యమన్నారు. అధికారం పోయినా అహంకారం వీడకుండా పోలీసు అధికారులను, ప్రజా ప్రతినిధులను దూషించి మూడు రోజులు సభను సజావుగా జరగకుండా చేశారన్నారు. అధికారులపై అనుచితంగా వ్యవహరించడం, మహిళా అధికారుల ముందు టీషర్టులు విప్పి ఇబ్బంది కలిగించడం చేశారు. శాసన సభాపతిని అత్యంత అభ్యంతరకరంగా దూషించారు. నిరసన తెలిపేందుకు

మిగతా 2వ పేజీలో..

## ఫ్యూచర్ సిటీపై గులాబీ దండయాత్ర

- సస్పెన్షన్‌కు బీఆర్ఎస్ కౌంటర్
- తుక్కుగూడ, రావిర్యాలలో కేటీఆర్, హరీశ్‌రావు పర్యటన
- టెస్సెరాక్ట్ భూములపై క్షేత్రస్థాయి పరిశీలన
- రేవంత్ కుటుంబానికి లబ్ధి చేకూర్చేలా భూకేటాయింపులంటూ ఆరోపణలు
- జీవోలు, టెండర్లు, భూకేటాయింపులపై ప్రశ్నలు
- ప్రభుత్వంపై న్యాయ, రాజకీయ పోరాటం ఉధృతం చేస్తామని సంకేతాలు

2



## రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే ..

- సీఎం తన తమ్ముడికి ఇంత తక్కువ ధరకు ఎట్లా కేటాయిస్తారు?
- భూ కేటాయింపు వివరాలు ప్రజలముందుంచాలి
- ఈ భూ దందాపై బీజేపీ ఎందుకు ప్రశ్నించదు?
- ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ

2



## నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

- ఇది రేవంత్ తెచ్చిన కరువు
- రాష్ట్ర రైతుకు నీరు నిల్.. ఏపీకి ఫుల్
- ఇదీ ప్రభుత్వ నిర్వాకం
- నిప్పులు చెరిగిన హరీష్‌రావు

2



## గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

- సోషల్ మీడియాలో దుష్ప్రచారాలు నమ్మొద్దు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదారాబాద్, సెప్టెంబర్ 10:** హైదరాబాద్ మహానగరంలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లపై సోషల్ మీడియాలో వస్తున్న ఊహాగానాలు, వ్యతిరేక ప్రచారాలపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

మిగతా 3వ పేజీలో..

## కరెంటు కోతలతో మళ్లీ పాత రోజులు: కేటీఆర్

- కాంగ్రెస్ పాలనలో విద్యుత్ సరఫరా తీరుపై విమర్శలు
- సీఎం సొంత ఊరిలోనూ రైతులకు కరెంటు కష్టాలంటూ ఆరోపణ
- కొండారెడ్డిపల్లిలో పంటలు ఎండిపోతున్నాయని రైతుల ఆవేదన
- మోటార్లు నడవక సాగుకు ఇబ్బందులు
- కేసీఆర్ హయాంలో 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్న కేటీఆర్

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ సరఫరా పరిస్థితి పూర్తిగా మారిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. మళ్లీ పాత రోజుల్లోని కరెంటు కష్టాలు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఊరు కొండారెడ్డి పల్లికి చెందిన రైతులతో కూడిన వీడియోను ఎక్స్‌లో పంచుకుంటూ ప్రభుత్వంపై

మిగతా 3వ పేజీలో..

## రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ వేడి

- రేవంత్‌తో భిన్నాభిప్రాయాలే.. విభేదాలు కావన్న ఎమ్మెల్యే
- మంచిని మంచి.. చెడును చెడుగా చెప్పడం తన నైజమని వెల్లడి
- మంత్రి పదవి సీఎం చేతిలో లేదని స్పష్టం
- పదవి కోసం ఎప్పుడూ రాజీ పడలేదని వ్యాఖ్య
- కలిస్తే కాంప్రమైజ్.. కలవకపోతే గ్యాప్ అంటూ ప్రచారంపై ఆగ్రహం

4

## రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిగా

- ప్రభుత్వం, ఉద్యోగులపై రూపాయి భారం పడకుండా అమలు
- 12.91 లక్షల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తింపు
- ఇప్పటికే 98 క్లెయిమ్‌ల పరిష్కారం
- ఉద్యోగుల కోసం హెల్త్‌కార్డు కూడా తీసుకొచ్చాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

4



## నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క

3

## ఇందిరమ్మ ఇళ్లు .. పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

3



- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ



## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

- శాసనమండలిలో మంత్రి అడ్లూరి

3

## హాస్పిటల్స్‌లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు

- శాసనమండలిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వెల్లడి

3

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- రవాణశాఖ మంత్రి పొన్నం వెల్లడి

3

# ఫ్యూచర్ సిటీపై గులాబీ దండయాత్ర

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** శాసనసభ నుంచి సస్పెన్షన్‌కు గురైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రభుత్వంపై పోరాటాన్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులో భారీ భూకేటాయింపులు జరిగాయని, వాటి ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరేలా వ్యవహరించారని బీఆర్ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు నేతృత్వంలోని బృందం రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, రావిర్యాల ప్రాంతాల్లో పర్యటించింది.

**టెస్సెరాక్ట్ భూముల పరిశీలన**

తుక్కుగూడలోని టెస్సెరాక్ట్ ఆవరణకు చేరుకున్న కేటీఆర్, హరీశ్‌రావు నేతృత్వంలోని సస్పెండెడ్ ఎమ్మెల్యేల బృందం అక్కడి భూములను పరిశీలించింది. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డికి ప్రయోజనం చేకూర్చేలా వేలాది కోట్ల విలువైన భూములను ప్రభుత్వం కేటాయించిందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. అసెంబ్లీలో తమకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా సస్పెండ్ చేసినా, ప్రజల తరపున క్షేత్రస్థాయిలో భూకేటాయింపుల వ్యవహారాలను బయటపెడతామని తెలిపారు.

**భూకేటాయింపులపై ప్రశ్నలు**

ఫ్యూచర్ సిటీ, తుక్కుగూడ, రావిర్యాల పరిధిలో ప్రభుత్వం జారీ చేసిన జీవోలు, టెండర్లు, భూకేటాయింపుల ప్రక్రియపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నలు సంధించారు. ప్రజా ప్రయోజనాల పేరుతో రైతుల భూములను స్వాధీనం చేసుకుని సీఎం కుటుంబానికి చెందిన సంస్థలు, కంపెనీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రియల్ ఎస్టేట్ వ్యవహారాలు ఏ స్థాయికి చేరాయో తుక్కుగూడ, రావిర్యాల భూకేటాయింపులు వెల్లడిస్తున్నాయని విమర్శించారు.

**పోలీసులతో వాగ్వాదం**

బీఆర్ఎస్ నేతల పర్యటనతో రావిర్యాల, ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. సస్పెండెడ్ ఎమ్మెల్యేలు, పార్టీ కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పార్టీ శ్రేణులు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. అసెంబ్లీలో సస్పెన్షన్‌కు గురైన తమ పోరాటాన్ని ప్రజాక్షేత్రంలో కొనసాగిస్తామని కేటీఆర్, హరీశ్‌రావు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, రేవంత్‌రెడ్డి కుటుంబంపై వస్తున్న భూకేటాయింపుల ఆరోపణలపై న్యాయపరంగా, రాజకీయంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. దీంతో ఫ్యూచర్ సిటీ భూకేటాయింపుల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరింత వేడి పెంచే అంశంగా మారింది..

# కేటీఆర్, హరీష్‌లపై లైంగిక వేధింపుల కేసు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** తెలంగాణ శాసనసభ సమావేశాల తొలిరోజు అసెంబ్లీ గేట్ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల నిరసన తీవ్ర వివాదానికి దారితీసింది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ నేతలను గేట్ నంబర్ 3 వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నేతలకు మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణలపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు.

**మహిళా కానిస్టేబుల్ ఫిర్యాదుతో కేసు**

సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తానీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు నేతలపై కేసులు నమోదయ్యాయి. నినాదాలతో కూడిన టీషర్టులు ధరించిన వారిని నిబంధనల ప్రకారం లోపలికి అనుమతించబోమని చెప్పినందుకు తమను తీవ్ర పదజాలంతో దూషించారని కానిస్టేబుల్ ఆరోపించారు. నిరసన సందర్భంగా కొందరు నేతలు టీషర్టులు విప్పి అర్ధనగ్నంగా తమ వైపునకు వచ్చారని, దీంతో తీవ్ర అసౌకర్యానికి, మానసిక వేదనకు గురయ్యామని ఫిర్యాదులో పేర్కొన్నారు. తోపులాటలో మహిళా సిబ్బందిపై శారీరక ఒత్తిడి తెచ్చి విధులకు ఆటంకం కలిగించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత చూసుకుంటామని బెదిరించారని ఆరోపించారు. ఘటనలో తాను మానసికంగా, శారీరకంగా గాయపడి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మీడియా వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు, వైద్య రికార్డులను పోలీసులకు అందించినట్లు వెల్లడించారు.

**కక్షసాధింపు చర్యలంటున్న బీఆర్ఎస్**

మరోవైపు కేసు నమోదుపై బీఆర్ఎస్ తీవ్రంగా స్పందించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా ప్రతిపక్ష నేతలను అడ్డుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులు పెట్టిందని ఆరోపించింది. తమ మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో పోలీసులు దురుసుగా వ్యవహరించిన అంశం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసులు నమోదు చేశారని కేటీఆర్, హరీశ్‌రావు వర్గాలు విమర్శించాయి.

మరోవైపు బీఆర్ఎస్ నేతల తీరును నిరసిస్తూ కాంగ్రెస్ మహిళా ఎమ్మెల్యేలు మహిళా కమిషన్‌ను ఆశ్రయించడంతో వివాదం మరింత ముదిరింది.

**సెక్షన్లతో మరింత ఉత్కంఠ**

భారతీయ న్యాయ సంహితలోని 74, 75(1), 79, 121(1), 132 తదితర సెక్షన్ల కింద కేసు నమోదు కావడంతో రాజకీయ వేడి పెరిగింది. ప్రజాప్రతినిధులపై మహిళా పోలీసుల విధులకు ఆటంకం, అసభ్య ప్రవర్తన, బెదిరింపుల ఆరోపణలు రావడంతో పోలీసుల దర్యాప్తుపై ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారం రానున్న రోజుల్లో అసెంబ్లీ లోపల, బయట కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య రాజకీయ ఘర్షణకు మరింత ఆజ్యం పోసే అవకాశముంది.

# రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు

**హైదరాబాద్, సెప్టెంబర్10:** సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (X) ఖాతాను ఆధారంగా చూపించి సభను తప్పుదోవ పట్టించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఎమ్మెల్యేలు బండారు లక్ష్మా రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు అందజేశారు.

ముఖ్యమంత్రి సభలో ఫేక్ ఎక్స్ ఖాతాను చూపించి చేసిన వ్యాఖ్యలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. నకిలీ ఖాతాను ఆధారంగా చేసుకుని అసెంబ్లీని తప్పుదోవ పట్టించేలా వ్యవహరించారని పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా సభ గౌరవానికి భంగం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే సీఎం చేసిన నిరాధార ఆరోపణల వల్ల బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ప్రతిష్టకు భంగం కలిగిందని ఎమ్మెల్యేలు ఆరోపించారు. సభలో ఆధారాలు లేని విషయాలను ప్రస్తావించడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ అంశంపై అసెంబ్లీ నిబంధనల్లోని రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చినట్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తెలిపారు. ఇదే అంశంపై అసెంబ్లీ స్పీకర్‌కు కూడా లేఖ రాశారు. సీఎం వ్యాఖ్యలను పరిశీలించి, సభా నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మొత్తంగా నకిలీ ఎక్స్ ఖాతాను అసెంబ్లీలో ప్రస్తావించిన అంశం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మరోసారి రాజకీయ వివాదానికి దారితీసింది. ఈ వ్యవహారంపై స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది.



# సభను అడ్డుకోవడానికి ఫామ్ హౌజ్‌లో కుట్ర

**మొదటిపేజీ తరువాయి**

ఎస్సీ సెల్ కార్యక్రమం చేపడితే దళితులు నడిచిన నేలను శుద్ధి చేసి అవమానించారు అన్నారు. ప్రతిపక్ష కుట్రను బలంగా తిప్పి కొట్టి ప్రభుత్వంపై జరిగిన కుట్రను ప్రజలకు తెలియజేసిన మిమ్మల్ని అభినందిస్తున్నానన్నారు. జరిగిన సంఘటనలపై విచారణ చేపట్టామన్నారు. సభ్యులు తప్పనిసరిగా సభలో చర్చల్లో పాల్గొనండి. సభలో హాజరు శాతం తగ్గకుండా చూసుకోవాలి. ప్రజలు ఇచ్చిన హోదాను సరైన విధంగా ఉపయోగించుకోకపోతే భవిష్యత్‌లో రాజకీయంగా రాణించలేరని హెచ్చరించారు. అందరికీ వెసులుబాటుగా ఉండాలని అత్యంత చారిత్రక భవనంలో శాసన మండలి నిర్వహిస్తున్నాం అసెంబ్లీలో సెంట్రల్ హాల్ ను ప్రారంభించుకుని దుద్దిళ్ల శ్రీపాదరావు గారి పేరు పెట్టుకున్నాం. సభలో నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలు ప్రస్తావించాలి. అసెంబ్లీ జరిగినన్ని రోజులు సభ్యుల హాజరు సంపూర్ణంగా ఉండాలి. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎదిగి కాంగ్రెస్ కు నష్టం చేకూర్చాలని చూస్తున్నారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీత లక్ష్మా రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? పోలీస్ సిబ్బందిలో కేటీఆర్ కు రేవంత్ రెడ్డి కనిపించినట్టున్నారని, అందుకనే అంత ఆక్రోశంతో అధికారులపై దాడులు చేశారని వ్యాఖ్యానించారు. దేశానికి మనం చేసిన జనగణన రోల్ మోడల్. ఇది రాష్ట్రం సాధించిన ఘనత. తెలంగాణ నమూనాను జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. సర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. ఎమ్మెల్యేగా గెలవాలనుకునే ప్రతీ ఒక్కరు ఈ ఓటు హక్కును కాపాడే అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలి. మీ ప్రతీ ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుంది. మీ వ్యక్తిగత పనితీరు మీ గెలుపు ఓటముల ను ప్రభావితం చేస్తుంది. సర్ అంశాన్ని సీరియస్ గా పరిగణనలోకి తీసుకోండి. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లు గా తేల్చారు, కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయన్నారు. ఎక్కడో ఏదో ప్రమాదం పొంచి ఉంది. వెయ్యి రోజుల పాలనకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మీ సహకారంతో దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు తీసుకువచ్చామని సీఎం రేవంత్ గుర్తు చేశారు.

# రూ.250 కోట్ల విలువైన భూమి రూ.7కోట్లకే ..

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :** ముఖ్యమంత్రి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి సుమారు రూ.250 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేవలం రూ.7 కోట్లకే కేటాయించారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూమిని మార్కెట్ విలువకు కాకుండా ఇంత తక్కువ ధరకు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు తుక్కుగూడకు గురువారం చేరుకుని భూమిని పరిశీలించారు. సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు కూడా ఉన్నారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఈ భూకేటాయింపుపై ప్రభుత్వం పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, మినహాయింపులు ఇవ్వడం అధికార దుర్వినియోగం కాదా? ప్రయోజనాల సంఘర్షణ కాదా? కుటుంబ పాలన కాదా? అని నిలదీశారు. మరోవైపు అనుముల జగదీశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థకు రూ.1,000 కోట్ల పెట్టుబడి పేరుతో ప్రభుత్వ రాయితీలు, భూములు, మినహాయింపులు కల్పించే వ్యవహారంపైనా కేటీఆర్ ప్రశ్నలు సంధించారు. ఒకవైపు గ్రేట్ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి.. మరోవైపు గ్రేట్ పారిశ్రామికవేత్త అనుముల జగదీశ్వర్‌రెడ్డి. ఇద్దరి మధ్య రూ.1,000 కోట్ల పెట్టుబడి ఒప్పందం. దానికి మళ్లీ ప్రభుత్వ రాయితీలు, ప్రభుత్వ భూములు, మినహాయింపులు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సోదరుడి సంస్థ ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో చేసుకున్న ఒప్పందంపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. రూ.250 కోట్ల విలువైన భూమిని రూ.7 కోట్లకే కేటాయించిన వ్యవహారంపై బీజేపీ, కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఈడీ, ఐటీ, సీబీఐలు తమ మీద కేసులు పెట్టడానికే ఉన్నాయా.. అధికారంలో ఉన్నవారి వ్యవహారాలు ఎందుకు కనిపించడం లేదు అని నిలదీశారు. తెలంగాణ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని ప్రధాని, కేంద్ర హోంమంత్రి ఆరోపిస్తున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ ఏటీఎంగా మారిందని ప్రధాని చెబుతున్నారు.. మరి తెలంగాణను కొల్లగొడుతున్నారని మీరు ఆరోపిస్తున్నప్పుడు దొంగలను పట్టుకోవాల్సిన హోంమంత్రి ఎక్కడున్నారు.. ఇంత పెద్ద వ్యవహారం జరుగుతున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు అని ప్రశ్నించారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలు కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు లోబడి ఉంటాయని కేటీఆర్ అన్నారు. ఈ రంగంలోనూ అధికారానికి దగ్గరగా ఉన్న కుటుంబాలకు ప్రయోజనాలు కల్పిస్తున్నారన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలతోపాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి చెందిన సంస్థలు కూడా ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలోకి రావడంపై పూర్తి వివరాలు వెల్లడించాలని కోరారు. శాసనసభలో ఈ భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ, ప్రభుత్వ విధానాలపై ప్రశ్నిస్తామనే తమను సస్పెండ్ చేశారని కేటీఆర్ అన్నారు. 'శాసనసభలో మా గొంతు నొక్కారు.. మీ దోపిడీని సభలో బయటపెడతామనే భయంతో మమ్మల్ని మెడపట్టి బయటకు



పంపారు.. అందుకే మీ తమ్ముడికి ఇచ్చిన భూమి వద్దకే వచ్చాం.. ఇక్కడి నుంచే ప్రజల తరపున ప్రశ్నిస్తున్నాం' అని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాయాజాలం నడుపుతున్నదని కేటీఆర్ ఆరోపించారు. గతంలో ఫార్మాసిటీ కోసం నిర్దిష్ట షరతులతో భూసేకరణ జరిగిందని, ఆ భూములను ఇప్పుడు ఇతర కార్యకలాపాలకు వినియోగించడం చట్టపరంగా ప్రశ్నార్థకమని అన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో పెట్టుబడులు పెడుతున్న పారిశ్రామికవేత్తలు ఈ న్యాయపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఫ్యూచర్ సిటీ భవిష్యత్తుపై న్యాయపరమైన చిక్కులు ఉన్నాయి.. రేపు కోర్టులో ఈ భూములపై వివాదాలు తలెత్తితే నష్టపోయేది పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలే. రేవంత్‌రెడ్డి కుటుంబ ప్రయోజనాల కోసం జరుగుతున్న రియల్ ఎస్టేట్ మాయాజాలంలో పెట్టుబడిదారులు బలిపశువులు కావద్దు అని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తే సామాన్యులు, యువత, రైతులకు కూడా ఇదే తరహాలో ప్రభుత్వ భూములు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాము రూ.లక్ష మూలధనంతో పెట్టుబడి పెడతామని వస్తే రూ.200 కోట్ల విలువైన స్థలం ఇస్తారా.. మాకూ అదే రాయితీలు, మినహాయింపులు ఇస్తారా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ వ్యవహారాన్ని ఇంతటితో వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ప్రజా కోర్టును ఆశ్రయిస్తామని, రంగారెడ్డి జిల్లాలోని ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి భూకేటాయింపులు, ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న వ్యవహారాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అవసరమైన అన్ని న్యాయ, ప్రజాస్వామ్య మార్గాలను అన్వేషించి పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. మీడియా కూడా ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం చూపిస్తున్న రంగుల కల వెనుక ఉన్న న్యాయపరమైన అంశాలను ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరారు. పెట్టుబడిదారులు భవిష్యత్తులో నష్టపోయే అవకాశం ఉన్న అంశాలను కూడా వెలుగులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి పదవిని ఉపయోగించుకుని కుటుంబ సభ్యులకు ప్రభుత్వ భూములు, రాయితీలు, పెట్టుబడి ప్రయోజనాలు కల్పించడం అధికార దుర్వినియోగం కాదా.. కుటుంబ పాలన కాదా.. ప్రయోజనాల సంఘర్షణ కాదా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. ప్రజల సొమ్ము, ప్రభుత్వ భూముల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాల్సిందేనని, ఈ భూవ్యవహారంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# నీరున్నా పంటలను కాపాడలేని ప్రభుత్వం

- **ఇది రేవంత్ తెచ్చిన కరువు**
- **రాష్ట్ర రైతుకు నీరు నిల్.. ఏపీకి ఫుల్**
- **ఇదీ ప్రభుత్వ నిర్వాకం**
- **మోటార్లను పూర్తిస్థాయిలో ఎందుకు నడపరు?**
- **పాలమూరుకు నీరందించలేని దద్దమ్మ ప్రభుత్వం**
- **నిప్పులు చెరిగిన హరీష్‌రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 10:** కండ్ల ముందు నీళ్లు పారుతున్నా పొలాలకు నీళ్లు ఇవ్వలేని పాలన. పంటలను కాపాడలేని పరిస్థితి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు రేవంత్ రెడ్డి తెచ్చిన కరవు అని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు బిడ్డను అని విర్రవీగే ఈ రేవంత్ రెడ్డి కృష్ణా జలాలు ఎత్తకుండా పాలమూరు ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నడన్నారు. రాష్ట్ర రైతాంగానికి నీళ్లు నిల్లు.. ఏపీ రైతాంగానికి నీళ్లు ఫుల్లు అని ఆరోపించారు. ఎల్ నినో ప్రమాదం ఉందని ప్రపంచ వాతావరణ సంస్థలు చెబుతున్నప్పుడు వచ్చిన నీళ్లు వచ్చినట్లు ఎత్తకుండా చోద్యం చూస్తున్నాడన్నారు. ఎత్తగలిగే అవకాశం ఉండి మోటార్లు బంద్ పెట్టి కూర్చున్నడని ఆరోపించారు. తెలంగాణ తెచ్చిన పార్టీగా తమకు బాధ్యత ఉందన్నారు. రేవంత్ రెడ్డికి తన గురువు బాగుంటే చాలు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం మొదటి పంప్ హౌజ్ ఎల్లూరు పంప్ హౌజ్ కేవలం రెండు మోటార్లు నడుస్తున్నాయి. మిగతా ఎందుకు బంద్ పెట్టావు.. ఆ రెండు కూడా ఆన్ అండ్ ఆఫ్ లో నడుస్తున్నాయి. సగటున 11 గంటలే మోటార్లు నడుపుతున్నారు. 24 గంటలు 5 మోటార్లు నడపాలి కానీ లేదు. రోజుకు 1600 క్యూసెక్కులు రావాల్సిన చోట 700 క్యూసెక్కులే వస్తున్నాయి. 4000 క్యూసెక్కులు ఎత్తగలిగే కెపాసిటీ ఉంటే రేవంత్ రెడ్డి ఎత్తుతున్నది 700 క్యూసెక్కులు. నీ ప్రాంతం మీద నీకున్న ప్రేమ వట్టి మాటలే. బాబుకి గురు దక్షిణ చెల్లించుకుంటున్నవా.. వెలిగొండ, పోతిరెడ్డి పాడు ద్వారా నీళ్లు తరలించుకుపోయేందుకు సహకరిస్తున్నవా అని ఆయన ప్రశ్నించారు. బీమా ప్రాజెక్టులో మూడు మోటార్లు ఉంటే ఒకటి నడుపుతున్నారు.. బేసిన్ తో సంబంధం లేని వెలిగొండ ద్వారా చంద్రబాబు నీళ్లు తీసుకుపోతుంటే బేసిన్ లో ఉండి, నికర జలాల కేటాయింపు ఉన్న బీమా ఎందుకు నడపట్టేదని హరీష్‌రావు ప్రశ్నించారు. నెట్టంపాడులో నాలుగు ఉంటే ఒకటి, కోయిల్ సాగర్ లో మూడు ఉంటే ఒకటి నడుపుతున్నరు. నీళ్లు ఉండి మోటార్లు నడపడం చేతగాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్న. అసెంబ్లీలో తాము ప్రజల తరపున మాట్లాడితే మార్షల్స్ పెట్టి మమ్మల్ని ఎత్తేసావు. మమ్మల్ని కాదు మోటార్లు ఆన్ చేసి కృష్ణా నీళ్లు ఎత్తు. రేవంత్ నిర్లక్ష్యం వల్ల తెలంగాణ వరప్రదాయిని అయిన కృష్ణా నీళ్లు ఏపీకి వరప్రదాయినిగా మారాయన్నారు. పాలమూరు, నల్లగొండ జిల్లాలకు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారు.. సాగు, తాగు నీళ్ల కోసం తండ్లాడుతున్నారు.. ముఖ్యమంత్రి నియోజకవర్గంలో రైతులు అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్నరు.. పొంగులేటి నియోజకవర్గంలో రైతులు ధర్నాలు చేస్తున్నరు.. రాష్ట్రవ్యాప్తంగా సబ్ స్టేషన్ల ముందు రైతులు ధర్నా చేస్తున్నరు అని తెలిపారు. రోమ్ తగలబడుతుంటే ఫిడేల్ వాయించినట్లు సస్పెన్షన్‌ల బిజీలో ఉన్నడు అని హరీష్‌రావు ఘాటుగా విమర్శించారు. నీళ్లు ఉండి నీళ్లు ఎత్తరు, ఉత్పత్తి కెపాసిటీ ఉండి కరెంట్ ఉత్పత్తి చేయడం లేదు. కేటీపీఎస్ 800 మెగావాట్ల ప్లాంటు మూసేసారు. 540 మెగావాట్ల బీటీపీఎస్ యూనిట్ 3,4 ప్లాంట్లు మూసేసారు. యాదాద్రిలో 4000 మెగావాట్లకు ఉత్పత్తి చేస్తున్నది. 2000 మెగావాట్లు ఒకవైపు బొగ్గు సర్ ప్లస్ ఉంది అంటున్నరు. మరోవైపు యాదాద్రి ప్లాంటుకు బొగ్గు సరఫరా చేయడం లేదన్నారు. కొండారెడ్డిపల్లిలో ధర్నా చేస్తున్న రైతులు, పొంగులేటి నియోజకవర్గంలో చేస్తున్న రైతులు బిఆర్ఎస్ కార్యకర్తలా అని ప్రశ్నించారు. కల్వకుర్తి, బీమా, నెట్టంపాడు, కోయిల్ సాగర్ ప్రాజెక్టులు 4000 కోట్లు ఖర్చు చేసి, పూర్తి చేసి ఆరున్నర లక్షల ఎకరాలకు



నీళ్లు ఇచ్చినం. మూడేళ్లలో ఇహెచ్టీ సబ్ స్టేషన్ ఒక్కటీ కట్టలేదు. రైతులకు ఇచ్చే పవర్ లేదు. ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి మాత్రం పవర్ ఉపయోగిస్తరన్నారు. కోమటి రెడ్డి నాడు కరెంట్ లేదని ఆయన విమర్శలు చేసారు.. ఇప్పుడు 7 గంటలు కూడా కరెంట్ వస్తలేదు, ఎందుకు లాగ్ బుక్స్ చూడటం లేదు. రేవంత్ రెడ్డిని చూస్తే లాగులు తడుస్తున్నాయా అని ప్రశ్నించారు. శ్రీశైలంలో మనకు ఉన్నవి కల్వకుర్తి, పాలమూరు ప్రాజెక్టులు. పాలమూరు ప్యాకేజీ3లో నెల రోజులు కష్టపడితే పూర్తి అవుతుంది. మూడేళ్ల నుంచి ఆ పని చేయడం లేదు. 5,6 లక్షల ఎకరాలకు నీళ్లు వస్తయి. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టు అని, కేసీఆర్ కు కీర్తి వస్తుందని పనులు పూర్తి చేయడం లేదు. పాలమూరు ప్యాకేజీ ని పడావు పెట్టినవు అధికారిక లెక్కల ప్రకారమే శ్రీశైలం నుంచి 35 టీఎంసీలు ఏపీ తీసుకుపోయింది. కానీ రేవంత్ ఎత్తింది కేవలం 7 టీఎంసీలు బిఆర్ఎస్ పోరాటం చేస్తే మొన్న కేటీఆర్ వెళ్తే సాగర్ కు కొద్దికొద్దిగా నీళ్లు ఇస్తున్నరు. బిఆర్ఎస్ నిలదీస్తే తప్ప మొద్దు నిద్ర వీడరా అని నిలదీశారు. ప్రకృతి వైపరీత్యం కాదు.. కాంగ్రెస్ వైపరీత్యం వచ్చింది. బేసిన్ లో లేని వెలిగొండకు నీళ్లు.. బేసిన్ లో ఉన్న మహబూబ్ నగర్ కు నీళ్లు లేని పరిస్థితి. 2024-25లో 28.49 శాతం, 2025-26లో 25.77శాతం మాత్రమే నీటి వినియోగం జరిగింది. ఆరు లక్షల ఎకరాలకు క్రాప్ హాలిడే ప్రకటించిన చేవలేని ప్రభుత్వం మీది. ఈ ఏడాది కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత అతి తక్కువ కృష్ణా జలాల వినియోగం జరిగింది ఈ మూడేళ్ల కాలంలోనే అని అన్నారు. ఎవర్ లోయెస్ట్ యుటిలైజేషన్ ఉన్న తాత్కాలిక వాటాను కూడా వాడుకోలేని చేతగాని ప్రభుత్వం ఇది. రైతులకు కావాల్సింది బూతులు కాదు.. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు కాదు.. పంపులకు పవర్, పొలాలకు సాగునీరు. ఎల్ నినో ప్రకృతి వైపరీత్యం కావచ్చు.. కానీ నీరు అందుబాటులో ఉండి కూడా రైతుకు అందించకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. కాంగ్రెస్ వైపరీత్యం. ముఖ్యమంత్రిగా మీ మౌనం తెలంగాణ తాగు, సాగునీటి ప్రయోజనాలకు శాపంగా మారుతోందన్నారు. ఏపీ నీటి తరలింపుకు వెంటనే అడ్డుకట్ట వేయాలి. అవసరం అయితే అపెక్స్ కౌన్సిల్ డిమాండ్ చేయాలి. పాలమూరు అన్ని ప్రాజెక్టుల మోటార్లు ఆన్ చేసి పొలాలకు నీళ్లు ఇవ్వాలి సాగర్ కాల్వకు నీళ్లు ఇవ్వాలి, నల్లగొండ పొలాలకు నీళ్లు మళ్లించాలి అని హరీష్‌రావు డిమాండ్ చేశారు. వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. పరిస్థితులు బాలేదు... అసెంబ్లీలో మాట్లాడమని ఫోన్లు చేస్తున్నరు. దీన్ని అడుగుతం అని మమ్మల్ని సభ నుంచి సస్పెండ్ చేసిండు. వర్షాల కారణంగా ఎస్ఆర్ఎస్పీలో 46టీఎంసీల నీళ్లు ఉన్నయి. గుత్ప అలీ సాగర్ లిఫ్టులు ప్రారంభించి చెరువులు నింపాలని డిమాండ్ చేస్తే తూతూమంత్రంగా గుత్ప లిఫ్టులు ఆన్ చేసారు. నాలుగు మోటార్లకు గాను ఒక్క మోటార్ నడిపిస్తున్నరు. వెంటనే పూర్తి స్థాయి గుత్ప లిఫ్టు నడపాలి. నాలుగు మోటార్లు నడిపి అన్ని చెరువులు నింపాలి. అలీ సాగర్ కెపాసిటీ 720. నాలుగు మోటార్లకు గాను సగమే నడుపుతున్నరు. అది కూడా ఆన్ అండ్ ఆఫ్ గా నడుపుతున్నరు. గుత్ప, అలీసాగర్ కలిపి రోజుకు 1260 క్యుసెక్కులు, నెల రోజులు నడిపినా 3 టీఎంసీలు మాత్రమే. అలా చేస్తే ఉన్న చెరువులు అన్ని నిండుతాయి. బాల్గొండ నియోజకవర్గంలో ఉన్న లక్ష్మీ కెనాల్ కు నిండుగా నీళ్లు ఇవ్వాలి. చౌటుపల్లి హన్మంతరెడ్డి లిఫ్టు సహా ఇతర అన్ని లిఫ్టులు ఆన్ చేయాలి.

# హాస్పిటల్స్‌లో మౌలిక వసతుల పెంపునకు చర్యలు

- మరో 9 హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలు
- 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు
- అదనంగా 485 వెంటిలేటర్ల ఏర్పాటు
- శాసనమండలిలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

ప్రభుత్వ హాస్పిటళ్లలో ఎంఆర్ఐ, సీటీ స్కాన్ సేవలను మరింత విస్తరిస్తున్నామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. కొత్తగా 9 ఎంఆర్ఐ యంత్రాలు, 8 సీటీ స్కాన్ యంత్రాలను ప్రభుత్వ హాస్పిటళ్లలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అదనంగా 485 వెంటిలేటర్లను కూడా కొనుగోలు చేసి అవసరమైన హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఎమ్మెల్సీలు గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. ప్రస్తుతం గాంధీ, ఉస్మానియా, నిమ్స్, వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్ రిమ్స్, డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో తొమ్మిది ఎంఆర్ఐలు, 50 సీటీ స్కాన్ యంత్రాలు, 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కొత్తగా నిజామాబాద్ జీజీహెచ్, సిద్ధిపేట జీజీహెచ్, సూర్యాపేట జీజీహెచ్, నల్గొండ జీజీహెచ్, మహబూబ్‌నగర్ జీజీహెచ్, నీలోఫర్ తదితర హాస్పిటల్స్‌లో ఎంఆర్ఐ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. గాంధీ, ఉస్మానియాల్లో



మెరుగైన వైద్య సేవలు అందిస్తుండడంతో అక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో అక్కడ అదనపు ఎంఆర్ఐ యంత్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొత్తంగా తొమ్మిది అత్యాధునిక టెక్నాలజీతో కూడిని 3టెస్లా ఎంఆర్ఐ యంత్రాలను కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం 50 ప్రభుత్వ హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలు అందుబాటులో ఉన్నాయని, కొత్తగా మరో 8 హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను ఏర్పాటు చేయనున్నామని మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ప్రస్తుతం 1,770 వెంటిలేటర్లు అందుబాటులో ఉన్నాయని, అవసరమైనచోట అదనంగా 485 వెంటిలేటర్లను ఏర్పాటు చేయనున్నామని చెప్పారు.

**వైద్య పరికరాల నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ**

వైద్య పరికరాలను కొనుగోలు చేయడం మాత్రమే కాక అవి నిరంతరం పనిచేసేలా చూడటానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. వైద్య పరికరాల కొనుగోలు, సరఫరా, నిర్వహణకు సంబంధించిన వివరాలను పర్యవేక్షించేందుకు ఈఉపకరణ్ అనే వెబ్ ఆధారిత పరికరాల జాబితా, నిర్వహణ వ్యవస్థను వినియోగిస్తున్నామని తెలిపారు. వైద్య పరికరాల పనితీరు, నిర్వహణ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు టీజీఎంఎస్ఐడీసీలో ప్రత్యేక ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. పీఎంయూ ద్వారా పరికరాలను క్రమం తప్పకుండా ఆడిట్ చేసి వాటి పనితీరు, వర్కింగ్ కండీషన్, నిర్వహణ పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో సర్వీసింగ్, రిపేర్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రిపేర్లు తక్షణమే జరిగేలా. బయోమెడికల్ ఇంజనీర్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు. వైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలంటే శిక్షణ పొందిన టెక్నీషియన్లు కీలకమని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో గత రెండున్నరేళ్లలో 1,500 మందికి పైగా టెక్నీషియన్లను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించామని వెల్లడించారు. అవసరమైనచోట కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో టెక్నీషియన్లను నియమిస్తున్నామని మంత్రి తెలిపారు.

**నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం**

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని(ఈహెచ్ఎస్) అమలు చేస్తున్నామని మంత్రి దామోదర్ తెలిపారు. 2026 జులై 17 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని మంత్రి తెలిపారు. చీఫ్ సెక్రటరీ అధ్యక్షతన నూతన ఈహెచ్ఎస్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) ఏర్పాటు చేశామని చెప్పారు. 30 మంది సభ్యులతో ఉన్న ఈ ట్రస్టులో ఉద్యోగ సంఘాల నుంచి 10 మంది, పెన్షనర్ సంఘాల నుంచి ముగ్గురు, ప్రభుత్వం నుంచి 16 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు తమ బేసిక్ పే/చివరగా పొందిన పెన్షన్‌లో 1.5 శాతం చొప్పున నెలకు చెల్లిస్తుండగా అంతే మొత్తాన్ని ప్రభుత్వం కూడా ఇస్తోందని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి నెలకు రూ.44 కోట్లు, ప్రభుత్వం నుంచి మరో రూ.44 కోట్లు కలిపి నెలకు రూ.88 కోట్లు సమకూరుతున్నాయని చెప్పారు. ఈ పథకానికి ఏడాదికి రూ.1,056 కోట్ల బడ్జెట్ ఉందని తెలిపారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం కింద 921 దవాఖానల్లో ఇన్‌పేషెంట్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని మంత్రి తెలిపారు. ఇందులో 114 ప్రభుత్వ, 807 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని చెప్పారు. పథకం ప్రారంభమైన తర్వాత ఇప్పటివరకు 8,511 కేసులకు రూ.55.14 కోట్ల ప్రీఆథరైజేషన్ ఇచ్చామని మంత్రి తెలిపారు. ఈ పథకం పరిధిలో 17 లక్షలకు పైగా లబ్ధిదారులు ఉన్నారని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి డిజిటల్ ఆరోగ్య కార్డులను వెబ్ పోర్టల్ ద్వారా జారీ చేస్తున్నామని చెప్పారు. ఓటీపీ ద్వారా స్వయంగా హెల్త్ కార్డును డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించామని తెలిపారు. అందరికీ హెల్త్ కార్డులు ఇస్తామని, ఉద్యోగులు కోరుకున్న విధంగా ఆరోగ్య సేవలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**37 వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటు**

ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఓపీ వైద్యం, వైద్య పరీక్షలు, మందులు అందించేందుకు ప్రస్తుతం 12 జిల్లాల్లో 12 వెల్‌నెస్ కేంద్రాలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. మరో 25 వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఇందులో 21 జిల్లాల్లో, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరిలో అధిక రద్దీ ఉన్న ప్రాంతాల్లో మరో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో మొత్తం వెల్‌నెస్ కేంద్రాల సంఖ్య 37కు చేరుతుందని చెప్పారు.

# నిధుల వినియోగానికి స్వేచ్ఛ అవసరం

- అందుకే పంచాయతీరాజ్ చట్టం-2018కు సవరణ
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన మంత్రి సీతక్క
- ఏకగ్రీవంగా శాసన సభ ఆమోదం

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

గ్రామ పంచాయతీకి వచ్చే డబ్బు గ్రామాభివృద్ధికే ఉపయోగపడాలి.. ఆదాయం గ్రామ అవసరాలకు అందుబాటులో ఉండాలి.. నిధుల వినియోగంలో పారదర్శకత ఉండాలి.. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలి.. ఇదే ప్రజా ప్రభుత్వ విధానం అని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. దేశంలో గ్రామీణ స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు 73వ రాజ్యాంగ సవరణ తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీలు కేవలం ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేసే సంస్థలుగా కాక ప్రజలకు దగ్గరగా ఉండే స్వయం పాలనా సంస్థలుగా పనిచేయాలన్నదే దాని ప్రధాన ఉద్దేశం అని చెప్పారు. అయితే స్థానిక సంస్థలకు అధికారాలు, బాధ్యతలతోపాటు వాటికి అవసరమైన ఆర్థిక వనరులు కూడా ఉండాలన్నారు. పంచాయతీలకు కొన్ని పన్నులు, సుంకాలు, ఫీజులు వసూలు చేసుకునే అధికారాలను కూడా కల్పించారని చెప్పారు. రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల ఏర్పాటు, పారిశుధ్యం నిర్వహణ, వీధి దీపాలు ఏర్పాటు, తాగునీటి సరఫరా వంటి అనేక ప్రాథమిక పౌర సేవల బాధ్యతలు ఉన్నాయి. జీపీలకు ఆదాయం సమకూర్చుకునే అధికారం ఇచ్చి ఆ ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకునే స్వేచ్ఛ లేకపోతే స్థానిక స్వపరిపాలన ఎలా బలపడుతుంది అని మంత్రి ప్రశ్నించారు. ఇదే ప్రశ్నకు సమాధానంగా రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం2018లోని సెక్షన్ 70లోని సబ్ సెక్షన్ 3కు సవరణ చేస్తూ బిల్లును ప్రవేశపెడుతున్నామన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా డ్రా చేసుకోవాలి. దీనికి ఒక నిర్దిష్టమైన ప్రక్రియ ఉంటుంది. దీని వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. గ్రామంలో సమస్య వస్తుంది.. కానీ దాన్ని పరిష్కరించడానికి అవసరమైన డబ్బు అందుబాటులోకి రావడానికి ఎందుకు ఆలస్యం కావాలి.. ఆ డబ్బును వినియోగించుకునే ప్రక్రియలో ఆలస్యం జరిగితే ప్రజలు ఇబ్బందులు పడతారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ఫైనాన్సు కమిషన్ నిధులు బ్యాంకు ఖతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నాం అని మంత్రి చెప్పారు.

**గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు**

మున్సిపాలిటీల్లో సొంత ఆదాయాన్ని బ్యాంకు ఖాతాల్లో వేసుకోవచ్చు.. కానీ పంచాయతీలకు ఆ వెసులుబాటు లేదు.. పంచాయతీల మీద గత ప్రభుత్వం వివక్ష చూపింది.. దాన్ని రూపుమాపడానికి చట్ట సవరణ చేస్తున్నాం.. గ్రామ సభ తీర్మానం మేరకు అవసరాలకు ఖర్చు చేసుకోవచ్చు. బీసీ రిజర్వేషన్ల కారణంగా పంచాయతీ ఎన్నికలు ఆలస్యం అయ్యాయి.. ఆ కాలానికి సంబంధించి కేంద్రం నుంచి నిధులు పూర్తి స్థాయిలో రాలేదు.. ప్రతి నెలా జీపీల కోసం రూ.50 కోట్లు వెచ్చిస్తున్నాం.. 202526 ఏడాదికి సంబధించి సెకండ్ ఇన్‌స్టాల్‌మెంట్ రూ.619 కోట్లు రావాల్సి ఉంది.. మొదటి తేదీనే మల్టీ పర్పస్ వర్కర్లకు జీతాలు ఇస్తున్నాం.. కేంద్రం నూతన విధానాల కారణంగా గ్రామాల అభివృద్ధిపై ప్రభావం చూపుతోంది.. వీజీజీ రాంతో రాష్ట్రాలపై రూ. 2 వేల కోట్ల అదనపు భారం పడుతుంది.. అయినా తాము పెద్ద ఎత్తున వీబీ జీ రాంజీ పనులు చేయిస్తున్నాం.. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలానికి పంట కుంట, ఊరికి ఉట కుంటను నిర్మిస్తున్నాం.. ప్రతి గ్రామానికి పక్కా రహదారి ఉండాలని సీఎం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి డబుల్ రోడ్లు ఇస్తున్నాం. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్లు నిర్మిస్తున్నాం.. ఫారెస్టు ప్రాంతాల్లో కేంద్ర అటవీ చట్టాలు రోడ్ల నిర్మాణానికి అడ్డంకులు ఎదురవతున్నాయి.. దీంతో ప్రజల" ఇబ్బందులు పడుతున్నారు.. కేంద్ర ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ ఇప్పించాలి అని అన్నారు. ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌పై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. బిల్లును అమోదించాలని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేయగా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనమండలిలోనూ పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఏకగ్రీవ ఆమోదం లభించింది.

# గణేష్ నిమజ్జనానికి హైడ్రా వ్యతిరేకం కాదు

**మొదటిపేజీ తరువాయి**

స్పందించారు. చెరువుల్లో గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి హైడ్రా ఎప్పుడూ వ్యతిరేకం కాదని, తాము పునరుద్ధరణ పనులు చేపడుతున్న చెరువుల వద్ద నిమజ్జనాలకు ఎలాంటి ఆంక్షలు విధించలేదని స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను ప్రజలు, ఉత్సవ నిర్వాహకులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నోటిఫై చేసిన నాలుగైదు సున్నితమైన చెరువుల వద్ద మాత్రమే ఆంక్షలు అమలులో ఉన్నాయని తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా బయోడైవర్సిటీగా గుర్తించిన అమీన్‌పూర్ చెరువు, నేచురల్ వెట్‌ల్యాండ్‌గా రక్షణ పొందిన కాప్రా చెరువులు ఇందులో ఉన్నాయని గుర్తు చేశారు. కాప్రా చెరువులో ప్రస్తుతం నీరు లేనందున అక్కడ ఎవరూ సమస్యలు సృష్టించవద్దని కోరారు. నగరంలోని మిగిలిన అన్ని చెరువులు, జలాశయాల్లో వినాయక నిమజ్జనాలు ఎప్పటి



లాగే యథావిధిగా సాగుతాయన్నారు. ప్రధాన నీటి వనరులు, చెరువుల పర్యావరణం దెబ్బతినకుండా ఉండేందుకు, భక్తులు, ఉత్సవ కమిటీలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు విస్తృతంగా బేబీ పాండ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హైడ్రా సుందరీకరిస్తున్న చెరువుల వద్ద ఎలాంటి నిషేధాలు లేవని, వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతంగా, పర్యావరణహితంగా నిర్వహించుకునేలా భాగ్యనగర ప్రజలు, ఉత్సవ సమితి ప్రతినిధులు సహకరించాలని కోరారు.

# త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈ-డ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- రవాణశాఖ మంత్రి పొన్నం వెల్లడి

**హైదారాబాద్, సెప్టెంబర్ 10 :**

గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీని మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసిందని, ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయని, కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుందని మంత్రి తెలిపారు. త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్ల



డించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చామని, హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు రాబోతున్నాయని, వాటిలో 50 పాత బస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం అని తెలిపారు. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారని, ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తామని చెప్పారు. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలని కోరారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించామని చెప్పారు. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591 కోట్లు

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

రాష్ట్రంలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆశ్రమ పాఠశాలల్లోని పోస్టుల అప్‌గ్రేడేషన్‌పై ఎస్సీ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్ కుమార్ శాసనమండలిలో గురువారం కీలక ప్రకటన చేశారు. ప్రశ్నోత్తరాల సమయంలో పలువురు ఎమ్మెల్సీలు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన వివరంగా సమాధానమిచ్చారు. ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, తక్కెళ్లపల్లి రవీందర్ రావు, సత్యం నెలికంటి అడిగిన ప్రశ్నలకు మంత్రి బదులిస్తూ.. 2025-26 విద్యా సంవత్సరం వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,591.62 కోట్లుగా ఉన్నట్లు సభకు వెల్లడించారు. ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న పండిట్లు, వ్యాయామ ఉపాధ్యాయుల (పీఈటీ) పోస్టులను స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశంపై ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ ప్రతిపాదన ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సా



ధ్యమైనంత త్వరగా దీనిపై తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమంతో పాటు సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.

**సర్టిఫికెట్ల నిలిపివేత ఆరోపణలు అవాస్తవం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రాకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఫీజులు వసూలు చేస్తున్నాయన్న సభ్యుల ఆరోపణలను మంత్రి తోసిపుచ్చారు. రాష్ట్రంలో అటువంటి పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అక్రమ వసూళ్లు లేనందున, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకునే ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు .. పేదల ఆత్మగౌరవానికి తగినట్టు

- ఇళ్లకు రూ.5 లక్షల ఉచిత సాయం ఎక్కడా లేదు
- రెండో విడతలో 59 వేల గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు
- ఏ నియోజకవర్గంలోని పేదలకు ఆ నియోజకవర్గంలోనే
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 10 :**

పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యులు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి గురువారం అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 3040కి.మీ అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. ప్రధానమైన సిమెంట్ ధరను పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సిమెంట్ కంపెనీలతో చర్చలు జరిపామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో రూ.310320 ఉన్న 50 కేజీల సిమెంట్ బ్యాగ్‌ను రూ.230కే పేదలకు అందించేలా ఒప్పందం పూర్తి చేశామని, త్వరలో అమల్లోకి వస్తుందని చెప్పారు. స్టీల్‌ను కూడా తక్కువ ధరకు అందించే దిశగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

**రూ.5 లక్షలు ఉచితంగా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ**

దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు.

**8 లక్షల ఇళ్లకు సుమారు రూ.40 వేల కోట్ల భారం**

మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

**చిన్న లోపాలతో ఆగిన 3,200 ఇళ్లకు పరిష్కారం**

మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

**పాత ప్రభుత్వ స్థలాల్లో నెల రోజుల్లో పేదలకు ఇళ్ల స్థలాలు**

గతంలో ఉమ్మడి ఏపీలో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. నెల రోజుల్లోగా ఆయా నియోజకవర్గాల్లో అర్హులైన పేదలకు ఈ స్థలాలు అందించేలా కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు.

**రాష్ట్రంలో 59 వేల గుడిసెలకు రెండో విడతలో ప్రాధాన్యత**

దశాబ్దాలుగా గుడిసెల్లోనే జీవిస్తున్న పేదలకు రెండో విడతలో శుభవార్త అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెలను రెండో విడతలో ప్రాధాన్యతగా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. హైదరాబాద్ క్యూర్ ప్రాంతంలోని 20 నియోజకవర్గాల్లో పైలట్ మోడల్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేశామని, వారి భౌతిక పరిశీలన పూర్తి చేసి తుది జాబితా సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్‌లో గృహ ప్రవేశాలు జరిగేలా కార్యక్రమాన్ని రూపొందించామని తెలిపారు. హైదరాబాద్‌తోపాటు ఇతర కార్పొరేషన్లలోనూ ఇదే విధానాన్ని పైలట్ మోడ్‌లో అమలు చేస్తున్నామని, అవసరమైతే మున్సిపాలిటీల్లోనూ పరిశీలిస్తామని మంత్రి స్పష్టం చేశారు.

**అసంపూర్తి 2బీహెచ్‌కేలకు రూ.750 కోట్ల చెల్లింపులు**

గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2బీహెచ్‌కే ఇళ్లను పూర్తి చేయడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు ప్రజా ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా వదిలిన ఆ ఇళ్లకు సుమారు రూ.750 కోట్ల బిల్లులు చెల్లించామని చెప్పారు. గతంలో వివిధ కారణాలతో సొంత డబ్బులతో ఫౌండేషన్, గోడలు లేదా స్లాబ్ వరకు నిర్మించి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఈసారి ప్రత్యేక అవకాశం కల్పించామని మంత్రి తెలిపారు. రెండో విడతలో ప్రతి 2,000 ఇళ్లలో 500 ఇళ్లను అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు కేటాయించే కొత్త విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

**డ్వాక్రా మహిళలకు రూ.లక్ష అడ్వాన్స్**

ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని డ్వాక్రా మహిళా సంఘాల్లో సభ్యులైన పేదలకు రూ.లక్ష అడ్వాన్స్‌గా అందించే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. పేదలు గుడిసెల నుంచి స్లాబ్ వేసిన ఇందిరమ్మ ఇళ్లలోకి మారేలా ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలని కోరారు.

# కరెంటు కోతలతో మళ్లీ పాత రోజులు: కేటీఆర్

**మొదటిపేజీ తరువాయి**

విమర్శలు గుప్పించారు.

**సీఎం సొంత ఊరిలోనూ కరెంటు కోతలే..**

'కాంగ్రెస్ ఉంటే కరెంటు ఉండదు.. ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన మార్పు?' అంటూ కేటీఆర్ వ్యంగ్యంగా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలోని ఆయన సొంత గ్రామంలోనూ రైతులు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక పంటలు ఎండిపోతున్నాయని, మోటార్లు పనిచేయక సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**మళ్లీ పాత కష్టాలేనంటూ..**

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అన్నదాతలకు



24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతులు మళ్లీ విద్యుత్ కష్టాలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సీఎం సొంత గ్రామంలోని పరిస్థితులే రాష్ట్రంలో విద్యుత్ సరఫరా తీరుకు నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు.

## స్పీకర్‌పై వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలకు షాక్?

హైదరాబాద్, సెప్టెంబర్ 10: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు సంబంధించి న్యాయపరమైన ఉత్కంఠ కొనసాగుతోంది. ఇప్పటికే ఇద్దరికీ మంజూరైన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సైఫాబాద్ పోలీసులు నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. కోర్టు విధించిన షరతులను ఉల్లంఘించడంతోపాటు దర్యాప్తు, సాక్ష్యాలను ప్రభావితం చేసేలా వ్యవహరించారని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు.

**అసెంబ్లీ వద్ద ఆందోళనతో కేసు**

అసెంబ్లీ వద్ద జరిగిన ఆందోళన సందర్భంగా పోలీసులతో వాగ్వాదానికి దిగడం, విధులకు ఆటంకం కలిగించడం, స్పీకర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేయడంపై సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో పోలీసులు రిమాండ్ కోరినప్పటికీ నాంపల్లి కోర్టు ఇద్దరు ఎమ్మెల్సీలకు బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ సమయంలో విధించిన నిబంధనలకు విరుద్ధంగా వారు వ్యవహరించారని పోలీసులు ఆరోపిస్తూ బెయిల్ రద్దు పిటిషన్ దాఖలు చేశారు.

**ఎస్సీ, ఎస్టీ కోర్టుకు బదిలీ చేయాలని..**

కేసు తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విచారణను ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేయాలని కూడా పోలీసులు నాంపల్లి కోర్టును కోరారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దళిత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో ఆయనపై చేసిన వ్యాఖ్యలకు అట్రాసిటీ చట్టంలోని నిబంధనలు వర్తిస్తాయని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఈ వ్యవహారం మరింత కీలకంగా మారింది.

**బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం**

పోలీసుల చర్యలపై బీఆర్ఎస్ తీవ్రంగా మండిపడుతోంది. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ప్రభుత్వం వరుస కేసులు, పిటిషన్లతో ఎమ్మెల్సీలను వేధిస్తోందని ఆరోపించింది. తాతా మధు, నవీన్‌రెడ్డి ఎలాంటి నిబంధనలను ఉల్లంఘించలేదని, చట్టపరంగానే వ్యవహరిస్తూ కోర్టులో కేసును ఎదుర్కొంటామని బీఆర్ఎస్ న్యాయ విభాగం నేతలు చెబుతున్నారు.

**కోర్టు ఉత్తర్వులపై ఉత్కంఠ**

బెయిల్ రద్దు, కేసు బదిలీపై నాంపల్లి కోర్టు త్వరలో విచారణ చేపట్టనుంది. బెయిల్ రద్దయితే ఇద్దరు ఎమ్మెల్సీలు తిరిగి జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడొచ్చు. కేసు ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు బదిలీ అయితే తదుపరి విచారణ అట్రాసిటీ చట్టం పరిధిలో కొనసాగనుంది. ఈ పిటిషన్లపై న్యాయస్థానం ఇచ్చే ఉత్తర్వులపై తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## రూ.కోటి బీమా.. దేశంలోనే తొలిగా

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు అందిస్తున్న రూ.కోటి బీమా పథకం దేశంలోనే తొలిసారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు. ఉద్యోగి దురదృష్టవశాత్తు మరణించినా అతడి కుటుంబం ఆర్థికంగా రోడ్డున పడకుండా భద్రత కల్పించాలనే మానవీయ ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా బ్యాంకుల సహకారంతో పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద బీమా, హెల్త్ కార్డుల గురించి సభ్యులు గురువారం అడిగిన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి వివరణాత్మకంగా జవాబిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం 16 బ్యాంకులతో ఒప్పందం చేసుకుని రెగ్యులర్ ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి బీమా కవరేజీ కల్పిస్తోందన్నారు. ఈ మేరకు 2024 జూన్ 26న ఆర్థిక శాఖ 77వ జీవో జారీ చేసిందని, పథకం అమలు విధానం, అర్హతలు, బీమా కవరేజీ, నిబంధనలు, షరతులను అందులో పేర్కొందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.కోటి బీమాతోపాటు ఇతర ప్రయోజనాలు కలిపి రూ.1.20 కోట్ల వరకు ప్రయోజనం అందేలా చర్యలు తీసుకున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. విమాన ప్రయాణ సమయంలో ప్రమాదం జరిగితే రూ.2 కోట్ల వరకు బీమా ప్రయోజనం కల్పిస్తున్నట్లు వెల్లడించించారు. సహజ మరణానికి రూ.10 లక్షల వరకు ప్రయోజనం కల్పించే వెసులుబాటు కూడా ఉన్నట్లు చెప్పారు.

**12.91 లక్షల మందికి కవరేజీ**

రాష్ట్రంలో మొత్తం 12,91,056 మంది ఈ పథకం పరిధిలో ఉన్నట్లు, వీరిలో 5,18,293 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నట్లు చెప్పారు. ఇంకా 5,00,158 మంది తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్, మల్టీపర్పస్ వర్కర్లు, కాంట్రాక్ట్, డైలీవేజ్, ఎన్ఆర్ఈజీఎస్, ఎంటీఎస్, సెర్ప్ తదితర సిబ్బంది ఉన్నారు. 2,72,600 మంది పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు ఉన్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి వివరించారు.

**సింగరేణితో శ్రీకారం**

ఉద్యోగుల కోసం రూ.కోటి బీమా పథకానికి తొలుత సింగరేణి కాలరీస్‌లో శ్రీకారం చుట్టినట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ పరిధిలోని డిస్కమ్‌లు, ఇతర సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పథకాన్ని విస్తరించినట్లు చెప్పారు. చివరగా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులందరికీ వర్తించేలా విస్తరించినట్లు పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులకు 2024 ఫిబ్రవరిలో, ఇంధన శాఖ ఉద్యోగులకు 2025లో, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ 2026 జూన్ 25 నుంచి పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

**ప్రభుత్వానికి రూపాయి భారం లేదు**

ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్న బ్యాంకులతో ప్రభుత్వం చర్చలు జరిపి ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగుల జీతాలు తమ బ్యాంకుల ద్వారా జమ అవుతున్నందున, బ్యాంకులకు వ్యాపారపరంగా ప్రయోజనం కలుగుతున్న నేపథ్యంలో బీమా పథకానికి బ్యాంకులే సహకరించేలా ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ప్రభుత్వంపై, ఉద్యోగులపై ఎలాంటి ప్రీమియం భారం లేకుండా పథకం అమలవుతోందన్నారు.

**ఇప్పటికే క్లెయిమ్‌ల పరిష్కారం**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి ఇప్పటివరకు 33 క్లెయిమ్‌లు వచ్చాయని, వాటిలో 24 క్లెయిమ్‌లను పరిష్కరించినట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఎస్పీడీసీఎల్, ఎన్‌పీడీసీఎల్, టీజీ జెన్‌కో, ట్రాన్స్‌కో పరిధిలో 15 క్లెయిమ్‌లు రాగా అన్నింటినీ పరిష్కరించినట్లు చెప్పారు. ఈ విభాగంలో రూ.15 కోట్లకు పైగా చెల్లింపులు జరిగినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా సింగరేణి కాలరీస్‌లో 50 క్లెయిమ్‌లు రాగా అన్నింటిని పరిష్కరించినట్లు తెలిపారు.

**కేంద్రం, ఇతర రాష్ట్రాలు అధ్యయనం**

రాష్ట్రంలో ప్రారంభించిన ప్రమాద బీమా పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అధ్యయనం చేసిందని ఉప ముఖ్యమంత్రి సభకు చెప్పారు. ఇతర రాష్ట్రాలు సైతం తెలంగాణలో అమలు చేస్తున్న ఈ బీమా విధానాన్ని పరిశీలించేందుకు ఆసక్తి చూపుతున్నాయని చెప్పారు. తమిళనాడు కూడా ఈ తరహా పథకాన్ని అమలు చేసినట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగులకు హెల్త్‌కార్డు**

బీమా పథకంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం హెల్త్‌కార్డు పథకాన్ని కూడా తీసుకొచ్చినట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. దశాబ్దాలుగా ఉద్యోగ సంఘాలు కోరుతున్న క్యాష్‌లెస్ వైద్య సేవల కలను ప్రభుత్వం సాకారం చేసిందని చెప్పారు. ఉద్యోగులు, వారి సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సంబంధిత ముఖ్య కార్యదర్శులతో కమిటీ ఏర్పాటు చేసి చర్చల అనంతరం హెల్త్‌కార్డుల విధానాన్ని ఖరారు చేసినట్లు వివరించారు. క్యాష్‌లెస్ వైద్యం, సీజీహెచ్ఎస్ ప్యాకేజీ వంటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెల్త్‌కార్డు పథకం కోసం ఇప్పటికే సుమారు రూ.240 కోట్ల నిధులు కేటాయించినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఉద్యోగుల సంక్షేమానికి బీమా, ఆరోగ్య భద్రతకు హెల్త్‌కార్డు, రెండు పథకాలూ ఉద్యోగ కుటుంబాలకు ఆర్థిక, వైద్య భరోసా కల్పించేలా రూపొందించామని ఉప ముఖ్యమంత్రి భట్టి శాసనసభకు చెప్పారు.

## రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో మళ్లీ వేడి

హైదరాబాద్, సెప్టెంబర్ 10: అసెంబ్లీలో సీఎల్పీ సమావేశం అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరోసారి పార్టీలో చర్చకు దారితీశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, వాటిని సీఎం, తన మధ్య వ్యక్తిగత విభేదాలుగా చిత్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆయన అన్నారు. మంచి జరిగితే మంచని, తప్పు జరిగితే తప్పని నిర్భయంగా చెప్పడం తన స్వభావమని స్పష్టం చేశారు.

**మంత్రి పదవిపై కీలక వ్యాఖ్యలు**

తనకు మంత్రి పదవి దక్కుతుందన్న ప్రచారంపైనా రాజగోపాల్‌రెడ్డి స్పందించారు. మంత్రి పదవి ఇవ్వడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతిలో ఉండదని, అది పార్టీ అధిష్ఠానం నిర్ణయిస్తుందని చెప్పారు. పదవి కోసం తాను ఎప్పుడూ రాజీపడలేదని స్పష్టం చేశారు.

**ప్రచారంపై మండిపాటు**

ముఖ్యమంత్రిని కలిస్తే రాజీపడ్డారని, కలవకపోతే ఇద్దరి మధ్య దూరం పెరిగిందని కొందరు ప్రచారం చేయడం సరికాదని రాజగోపాల్‌రెడ్డి మండిపడ్డారు. తన రాజకీయ వైఖరిని వ్యక్తిగత సంబంధాలతో ముడిపెట్టి తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన సూచించారు.

## 17న పబ్లిక్ గార్డెన్‌లో ప్రజా పాలన దినోత్సవం

- ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష
- వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 10 : పబ్లిక్ గార్డెన్‌లో ఈనెల 17న నిర్వహించే తెలంగాణ ప్రజా పాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లపై సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆరోజు ఉదయం అసెంబ్లీ ఎదురుగా గల అమరవీరుల స్థూపం వద్ద ముఖ్యమంత్రి నివాళులర్పించి అనంతరం పబ్లిక్ గార్డెన్‌కు వస్తారని తెలిపారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద, పబ్లిక్ గార్డెన్‌లో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని పలు ప్రధాన భవనాలకు, చారిత్రక కట్టడాలకు విద్యుద్దీపాల అలంకరణ చేపట్టాలన్నారు. ఈనెల 15న డ్రెస్ రిహార్సల్‌స్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రజాపాలన దినోత్సవానికి వేయిమంది స్వయం సహాయక మహిళలతోపాటు రెండు వేల మంది హాజరవుతారన్నారు. సమావేశానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు జయేష్ రంజన్, వికాస్ రాజ్, అహ్మద్ నదీమ్, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, క్రిస్టినా చొంగ్తూ, శిఖా గోయల్, హైదాబాద్ సి.పి.సజ్జనార్, ఆర్టీసీ ఎండి నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డి తదితర సీనియర్ అధికారులు హాజయ్యారు.



**వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పక్కా ఏర్పాట్లు చేయాలి**

వానాకాలం (202627 ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. గత సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు.

## అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు

- తుమ్మల పనితీరుపై బీజేపీ ఎమ్మెల్యేల ప్రశంసలు



హైదరాబాద్, సెప్టెంబర్ 10 : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పనితీరుపై బీజేపీ శాసనసభ్యులు పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు. పార్టీలు వేరైనా ప్రజలకు మంచి చేసే నాయకుడిని, వారి నిబద్ధతను గుర్తించి మెచ్చుకోవడంలో తప్పులేదని వారు స్పష్టం చేశారు. 'మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారు. ప్రజాప్రతినిధులుగా మేము కూడా ఇంతటి ఓపిక, జవాబుదారీతనం ఉన్న మంత్రిని గతంలో చూడలేదు' అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఏ సమస్యపై ఫోన్ చేసినా మంత్రి తుమ్మల వెంటనే స్పందిస్తారని, ఆదివారాలు లేదా సెలవు రోజుల్లో కూడా ప్రజా సమస్యలపై అందుబాటులో ఉంటారని తెలిపారు. సమీక్షలు లేదా పనుల్లో ఉండి ఫోన్ తీయలేకపోయినా వీలైనంత త్వరగా తిరిగి ఆయనే కాల్ చేసి మాట్లాడతారని చెప్పారు. ప్రజలు లేదా నియోజకవర్గాల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళితే ఎంతో ఓపికతో విని ఆ సమస్య పూర్తయ్యే వరకు అధికారులతో స్వయంగా మాట్లాడతారన్నారు. పని ఏ దశలో ఉందో, ఎప్పుడు పరిష్కారమవుతుందో కూడా మళ్లీ తిరిగి ఫోన్ చేసి అప్‌డేట్ ఇవ్వడం ఆయన ప్రత్యేకత అని కొనియాడారు. శాసనసభకు కొత్తగా ఎన్నికైన సభ్యులు, తోటి మంత్రులు తుమ్మల పాలనా సమర్థతను, ఓపికను ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్యేలు సూచించారు.

## మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసం వద్దు

- నదిని, పర్యావరణాన్ని, ప్రజల హక్కులను కాపాడాలి
- ప్రజలను నిర్వాసితులను చేసే విధానాన్ని మార్చాలి
- మూసీ రివర్ ప్రాజెక్టును పునః సమీక్షించాలి
- మూసీ జన ఆందోళన్ డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 10: మూసీ నది పునరుజ్జీవనం పేరుతో చేపడుతున్న ప్రస్తుత మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు నదిని శుద్ధితో పాటు ప్రజల ఇళ్లు, జీవనోపాధులు, పర్యావరణాన్ని రక్షించే విధంగా ఉండాలని, ప్రజలను నిర్వాసితులను చేసే ప్రాజెక్టు విధానాన్ని మార్చాలని డిమాండ్ చేస్తూ మూసీ జన ఆందోళన ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత దళిత బహుజన ఫ్రంట్ నాయకుడు శంకర్ సభకు ఆహ్వానం పలికారు. డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మంజుల బస్తీ ప్రజల నిర్వాసితుల బాధలను ప్రతిబింబించే పాటతో కార్యక్రమం ప్రారంభమైంది. సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త సజయ సభకు అధ్యక్షత వహించారు. మానవ హక్కుల వేదిక నాయకుడు జీవన్ కుమార్ ప్రారంభోపన్యాసం చేస్తూ మూడు దశాబ్దాలుగా మూసీ నది, దాని పరివాహక ప్రాంత ప్రజలపై ప్రభుత్వాలు అనుసరి స్తున్న విధానాలను వివరించారు. ప్రస్తుత మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు ప్రజలకు, నదికి ప్రయోజనం కలిగించే విధంగా లేదన్నారు. ఈ సందర్భంగా 'మూసీ పునరుజ్జీవం పేరిట విధ్వంసమా? – నదిని కాపాడుకుందాం, ప్రజాహక్కులను రక్షించుకుందాం' అనే కరపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు విడుదల చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు పరిధిలోని బాధితులు, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్ తమ అనుభవాలను వివరించారు. ప్రభుత్వం వివిధ రకాలుగా ప్రజలను మభ్యపెట్టడం, భయపెట్టడం, ఒత్తిడికి గురిచేయడం జరుగుతోందని తెలిపారు. బాపుఘాట్, హైదర్‌షాకోట్, బుద్వేల్, హైదర్‌గూడ, చాదర్‌ఘాట్ ప్రాంతాలతోపాటు మూసీ దిగువ ప్రాంత గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు వైశాలి, సుధా గోపరాజు, బిలాల్, ముస్కన్, అనిత, కొమురయ్య, బట్టు శంకర్, బాలయ్య తదితరులు తమ ఇళ్లు, పొలాలను ఏ పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్పష్టం చేశారు. మూసీ జన ఆందోళన కొనసాగిస్తున్న ప్రజా ఉద్యమానికి మద్దతుగా వివిధ పార్టీల ప్రతినిధులు ధర్నాలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీఆర్ఎస్ తరపున మనోజ్, న్యూడెమోక్రసీ తరపున ఝాన్సీ, సీపీఐ తరపున స్టాలిన్ పాల్గొని మూసీ ప్రాజెక్టు బాధితులకు తమ మద్దతును తెలిపారు. పర్యావరణవేత్తలు డాక్టర్ బాబూరావు, డాక్టర్ దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ప్రాజెక్టు వల్ల సంభవించే పర్యావరణ ప్రభావాలను వివరించారు. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో పర్యావరణ అంశాలను నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును ప్రస్తుత రూపంలో వ్యతిరేకించాలని, నదిని కేవలం ఒక నగర అభివృద్ధి ప్రాజెక్టుగా కాక మొత్తం నది పరివాహక ప్రాంతం ప్రాతిపదికన చూడాలని వారు సూచించారు. ప్రజా సంఘాల ప్రతినిధులు సంధ్య, మీరా సంఘమిత్ర, జ్యోతి, ఉషా సీతాలక్ష్మి, విమలక్క, సిస్టర్ లిసి, శంకర్, అఖిల్, రవి కన్నెగంటి, వేణు, సంజీవ్ తదితరులు మాట్లాడుతూ, మూసీ బాధితులకు అండగా ఉంటామని తెలిపారు. ప్రజలకు, మూసీ నదికి న్యాయం చేయని ఏ ప్రాజెక్టునైనా నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం మూసీ నదిని శుభ్రపరిచేందుకు ₹7,345 కోట్ల మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టిందని తెలిపారు. ఇందులో ఫేజ్ 1ఎ హిమాయత్ సాగర్ నుంచి 9.1 కి.మీ, ఫేజ్ 1బి గండిపేట నుంచి 11.8 కి.మీ పరిధిలో గాంధీ సరోవర్ పేరుతో పనులు చేపడుతున్నారన్నారు.

## పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు

హైదారాబాద్, సెప్టెంబర్ 10: హైదరాబాద్ శివారులో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన ఘటన కలకలం రేపింది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని బాటసింగారం వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కనే ఉన్న పెట్రోల్ బంకులోకి దూసుకెళ్లిన బస్సు రెండు కార్లు, ఓ ఆటోను ఢీకొట్టగా అవి ధ్వంసమయ్యాయి. అంతేకాక డీజిల్ పంపును కూడా బస్సు ఢీకొనడంతో బంకు పరిసరాల్లో ఒక్కసారిగా భయానక పరిస్థితి నెలకొంది. ప్రమాదం జరిగిన సమయంలో పెట్రోల్ బంకు వద్ద పెద్దగా జనసంచారం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. భారీ ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నప్పటికీ అదృష్టవశాత్తూ పెను ముప్పు తప్పింది. బస్సు అదుపుతప్పి బంకులోకి దూసుకెళ్లిన దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డయింది. బైక్‌ను తప్పించబోయే సమయంలోనే బస్సు డ్రైవర్ నియంత్రణ కోల్పోయినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు డ్రైవర్ పరిస్థితి, ప్రమాద సమయంలో వాహనం వేగం, ఇతర సాంకేతిక కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలో మరో రోడ్డు ప్రమాదం జరిగింది. దుర్గాపురం స్టేజ్ సమీపంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రెండు లారీల క్యాబిన్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

## తెలంగాణ అభివృద్ధికి మోదీ చారిత్రక నిర్ణయం

- ఘట్‌కేసర్-కాజీపేట రైల్వే బహుళ ట్రాకింగ్‌కు ఆమోదం
- రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో తెలంగాణకు అత్యంత ప్రయోజనకరమైన సికింద్రాబాద్ (ఘట్‌కేసర్)కాజీపేట బహుళ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టుకు ఆమోదం లభించడం పట్ల హృదయపూర్వక స్వాగతం పలుకుతున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎనిమిది రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు రూ.20,804 కోట్లతో బుధవారం ఆమోదం తెలుపగా ఇందులో సికింద్రాబాద్‌ఘట్‌కేసర్‌కాజీపేట మార్గం తెలంగాణ రైల్వే వ్యవస్థకు జీవనాడి వంటిదన్నారు. సరకు రవాణా వేగవంతమై పరిశ్రమలు, రైతులు, వ్యాపారులు, యువతకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ నిర్ణయం ప్రధాని మోదీ వికసిత భారత్, వికసిత తెలంగాణ సంకల్పానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు రహదారి, రైలు, పరిశ్రమలు, మార్కెట్ల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేస్తాయని, రవాణా వ్యయం తగ్గి, సరఫరా వ్యవస్థ మరింత సమర్థవంతంగా మారుతుందని తెలిపారు. తెలంగాణకు ప్రయోజనాలు సికింద్రాబాద్‌కాజీపేట కారిడార్‌లో రద్దీ తగ్గి రైళ్ల సమయ పాలన, సేవా విశ్వసనీయత మెరుగుపడుతుందని డాక్టర్ లక్ష్మణ్ తెలిపారు. ప్రయాణికుల రైళ్లతోపాటు బొగ్గు, సిమెంట్, ఇనుముఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైళ్లు, ఆహార ధాన్యాలు, పెట్రోలియం ఉత్పత్తులు, ఎరువుల రవాణాకు అదనపు సామర్థ్యం ఏర్పడుతుందన్నారు. తెలంగాణలోని పరిశ్రమలకు సరకు రవాణా సౌలభ్యం పెరిగి లాజిస్టిక్స్ వ్యయం తగ్గే అవకాశం ఉంటుందని, నిర్మాణ దశలో ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అనుబంధ సేవా రంగాలకు కూడా ఉత్సాహం లభిస్తుందన్నారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, భువనగిరి కోట వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలకు చేరువ మెరుగవుతుందన్నారు. ప్రధాని మోదీ తెలంగాణపై చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఈ నిర్ణయం స్పష్టమైన నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ప్రధానికి, రైల్వే శాఖకు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శుక్రవారం
సెప్టెంబర్ 11, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## సోనాల మాట.. ఒకే బాట



**బోథ్/సోనాల, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

వినాయక ఉత్సవాల నిర్వహణపై సోనాల గ్రామంలో మండపాల నిర్వాహకులు, గ్రామ పెద్దలు, యువకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన వారు గ్రామంలోని అన్ని గణపతి విగ్రహాలను 12వ రోజున ఒకేరోజు నిమజ్జనం చేయాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. వినాయక ఉత్సవాలను ఐక్యత, సోదరభావంతో నిర్వహించాలని నిర్ణయించారు. గ్రామాభివృద్ధి కోసం రాజకీయ, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని తీర్మానించారు. సోనాలను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రయోజనాలకు ప్రాధాన్యమిస్తూ ఐక్యంగా ముందుకు సాగుతామని సమావేశంలో పాల్గొన్న వారు తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



**ఆర్మూర్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆర్మూర్ రజక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. దోబీఘాట్ వద్ద ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ గోనె లహరి రఘు, 30వ వార్డు కౌన్సిలర్ గుంజిల పృథ్వీరాజ్ హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూస్వాములు, దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా శక్తికి, ఆత్మగౌరవానికి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జిల్లా రజక ఐక్యవేదిక అధ్యక్షుడు దమ్మాన స్వామి, యువజన కమిటీ జిల్లా అధ్యక్షుడు మీరా శ్రావణ్, ఆర్మూర్ రజక సంఘం అధ్యక్షుడు చల్లగారిగే సుదర్శన్, ప్రధాన కార్యదర్శి పతేపూర్ శంకర్, సర్వజన సమాజ్ సభ్యుడు చౌదరి అశోక్, సంఘం సభ్యులు తొర్లికొండ చిన్నస్వామి, దత్తపురం శ్రీధర్, ఆలూర్ మోహన్, రామడి శంకర్, బ్రాహ్మణపల్లి లింగం, రజక సంఘం నాయకులు, యువజన కమిటీ సభ్యులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చిట్యాల ఐలమ్మ పోరాటం హిందూ–ముస్లిం పోరాటం కాదు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాటం హిందూ–ముస్లింల మధ్య జరిగిన పోరాటం కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ. రమేష్‌బాబు అన్నారు. ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం హిందూ–ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరిస్తూ భాజపా చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పెద్ది వెంకట్‌రాములు, జిల్లా కమిటీ సభ్యులు విఘ్నేష్, సురేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి సిరిపాలింగం, నగర నాయకులు అనసూయమ్మ, అనిత, ఉద్దవ్, అబ్దుల్, శంషాద్దీన్, అంజయ్య, ఈవీఎల్ నారాయణ, గోపి, రాజు పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ భవేష్ మిశ్రా గురువారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోడౌన్ సీల్‌ను తెరిచి ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర ఎన్నికల సామగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా పటిష్ఠ భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి శంకర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు
- ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

వచ్చే ఏడాది జూన్, జులై నెలల్లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాల కల్పనకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచ వద్ద పుష్కర ఘాట్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులకు గురువారం ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపన చేశారు. కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో రూ.6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్లతో రహదారులు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. యంచ వద్ద రూ.2.15 కోట్లతో పుష్కర ఘాట్, రూ.70 లక్షలతో రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందన్నారు. కందకుర్తి పుష్కర క్షేత్రంలోనే వివిధ శాఖల పనులకు కలిపి సుమారు రూ.30 కోట్లు వెచ్చిస్తున్నట్లు వివరించారు. భక్తుల రాకపోకలు, వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. భక్తులకు అన్ని వసతులు అందుబాటులో ఉండేలా, సురక్షిత వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**పనులు సకాలంలో పూర్తి చేయాలి**

పుష్కర పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయకుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకటరమణ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై ఓమయ్య



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

రెండో పీఆర్సీలో కార్మికుల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచి అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వై. ఓమయ్య డిమాండ్ చేశారు. గురువారం నిజామాబాద్ నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో సెప్టెంబరు 6, 7, 8 తేదీల్లో నిర్వహించిన ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యాయని ఓమయ్య తెలిపారు. దేశ, రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో విస్తృతంగా చర్చించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించి అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలని అన్నారు. హమాలీ కార్మికులకు భవన నిర్మాణ కార్మికుల తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2019 మోటారు వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, కార్మికులకు కనీస పింఛను రూ.15 వేలు అమలు చేయాలని కోరారు. కార్మికుల వివిధ సమస్యలపై 45 తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. ఈ తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

**నూతన కమిటీ ఎన్నిక**

రాష్ట్ర మహాసభలో నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఓమయ్య తెలిపారు. నిజామాబాద్ జిల్లా నుంచి రాష్ట్ర కార్యదర్శిగా వై. ఓమయ్య, కార్యవర్గ సభ్యులుగా పిన్నెల హనుమాన్లు, రాష్ట్ర సమితి సభ్యులుగా ఎన్. దేవేందర్, ఎస్. కవిత, గోవర్ధన్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు. నూతన కమిటీకి జిల్లా సమితి తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మరింత విస్తృతంగా పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో హనుమాన్లు, దేవేందర్, టీ. చక్రపాణి, ఎస్. కవిత, గోవర్ధన్, బి. అనిల్, రాధాకుమార్, ఫిరోజ్ అలీ, భానుచందర్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 15న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్లు, గోదాములు, రైస్‌మిల్లులు, సిమెంట్, కూరగాయల మార్కెట్లు, ఎరువుల గోదాములు, పరిశ్రమలు, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వేలాది హమాలీ కార్మికులకు చట్టబద్ధమైన రక్షణ లేకుండా పోయిందని ముల్లె హమాలీ యూనియన్ అధ్యక్షుడు ఎం. మోహన్ అన్నారు. హమాలీలకు సమగ్ర భద్రత కల్పించే ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ గురువారం నిజామాబాద్ నగరంలోని శ్రద్ధానంద్‌గంజ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం, ప్రత్యేక సంక్షేమ బోర్డు లేకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారంగా మారుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. పనిచేసే ప్రదేశాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, వాటివల్ల కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాల్లో మృతిచెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలకు జీవనభృతి, తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన తర్వాత శారీరకంగా పనిచేయలేని పరిస్థితికి చేరుకుంటున్న హమాలీలకు నెలకు రూ.10 వేల పింఛను ఇవ్వాలని కోరారు. హమాలీ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని, అన్ని రకాల హమాలీలకు గుర్తింపు కార్డులు జారీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ నెల 15న జరిగే రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెజిటేబుల్ ముల్లె హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసు, రఘు, గంగాధర్, సాయిలు, అంజయ్య, రమేష్, జగన్, లచ్చిరాం, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను శుద్ధీకరణ పేరుతో అవమానించడం సరికాదు

- కుల వివక్షకు తావులేకుండా కఠిన చట్టాలు తీసుకురావాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



దళితులను శుద్ధీకరణ పేరుతో అవమానించడం అత్యంత హేయమైన చర్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి పి. సుధాకర్ అన్నారు. గురువారం నిజామాబాద్ నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నడిచారనే కారణంతో బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లు చల్లి శుద్ధీకరణ చేయడం దళితులను అవమానించడమేనని ఆరోపించారు. దేశంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం అమలవుతున్న నేపథ్యంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కుల వివక్షకు చరమగీతం పాడేలా కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. అంటరానితనం, వెట్టిచాకిరీ వంటి దురాచారాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల ఫలితంగానే సమాజం అభివృద్ధి చెందిందని సుధాకర్ పేర్కొన్నారు. అంబేద్కర్ నేతృత్వంలో సమానత్వాన్ని ప్రాతిపదికగా చేసుకుని రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని తెలిపారు. ఒకవైపు అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసి, ఆయన జయంతి, వర్ధంతులను ఘనంగా నిర్వహిస్తూ.. మరోవైపు శుద్ధీకరణ పేరుతో దళితులను అవమానించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దేశం రాజ్యాంగబద్ధ పాలనలో కొనసాగుతోందా? లేక మనుస్మృతి ఆధారిత వ్యవస్థ వైపు వెళ్తోందా? అనే అనుమానం కలిగేలా ఇటువంటి ఘటనలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

## ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భూమయ్య

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతున్న జిల్లా వాసి వేల్పూర్ భూమయ్య అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అగ్గు ఎర్రన్న తెలిపారు. గురువారం మోపాల్ మండలంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల పట్టణంలో నిర్వహించిన ఏఐకేఎంఎస్ 9వ రాష్ట్ర మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై విస్తృతంగా చర్చించినట్లు ఎర్రన్న తెలిపారు. కేంద్రంలోని ఆర్ఎస్ఎస్, భాజపా ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వ్యవసాయ రంగంలో అమలు చేస్తున్న విధానాలు రైతులకు నష్టం కలిగిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే అప్పుల భారంతో సతమతమవుతున్న రైతులను ప్రభుత్వ విధానాలు మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయని పేర్కొన్నారు. దేశ వనరులు, సంపద, భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తూ రైతులను భూముల నుంచి వెళ్లగొట్టే విధానాలను అవలంబిస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ప్రజలను ఉపాధికి దూరం చేస్తున్నారని, విద్యార్థులు, యువతకు ఉపాధి కల్పించే చర్యలు చేపట్టకుండా మత విద్వేషాలను రెచ్చగొట్టే కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రైతులందరినీ ఐక్యం చేసి బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు ఎర్రన్న తెలిపారు. ఏఐకేఎంఎస్ జాతీయ నాలుగో మహాసభలను ఈ నెల 29, 30, 31 తేదీల్లో ఖమ్మం నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



నిజామాబాద్ నగరంలోని వినాయక్ నగర్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ గారి వర్ధంతి కార్యక్రమాన్ని రెవల్యూషనరీ సోషలిస్టు పార్టీ , అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్పీ జిల్లా కార్యదర్శి కటారి రాములు, డి. కృష్ణ, సునీల్, సూర్యపాల్, రంజిత్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం.. మహాదానం




**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

రక్తదానం మహాదానమని, ఆరోగ్యవంతులు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని నిజామాబాద్ రెడ్‌క్రాస్ చైర్మన్ బుస ఆంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సభ్యులతో పాటు పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బుస ఆంజనేయులు మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో ఉండేందుకు స్వచ్ఛంద రక్తదానం ఎంతో అవసరమన్నారు. యువత పెద్ద సంఖ్యలో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా అదనపు కోశాధికారి కరిపె రవీందర్, ఇందూర్ క్లబ్ అధ్యక్షుడు పి. రాఘవేందర్, కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్, ప్రోగ్రాం చైర్మన్ జైపాల్ కాలె, రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు



**బోథ్/సోనాల, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో పొలాల అమావాస్య వేడుకలు ఘనంగా జరిగాయి. బోథ్, సోనాల మండలాల్లో రైతులు వ్యవసాయంలో తమకు అండగా నిలిచే బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బసవన్నలకు రంగురంగుల అలంకరణలు చేసి హనుమాన్, పోచమ్మ ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో బసవన్నలను ఊరేగిస్తూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. నైవేద్యాలు సమర్పించి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. పల్లె జీవనంలో ప్రత్యేక స్థానం కలిగిన పొలాల అమావాస్య రైతుల సంప్రదాయాలు, వ్యవసాయ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచింది. పొలాల్లో రైతులకు తోడుగా నిలిచే బసవన్నలతో వారికి ఉన్న ఆత్మీయ అనుబంధానికి ఈ పండుగ ప్రతీకగా భావిస్తారు. వేడుకల సందర్భంగా పల్లెల్లో ఎక్కడ చూసినా పండుగ సందడి నెలకొంది. బసవన్నల అలంకరణలు, ఊరేగింపులతో గ్రామాల్లో ప్రత్యేక వాతావరణం కనిపించింది.

## రఘు కుటుంబానికి అండగా ఉంటాం



**ఇందల్వాయి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచ్ అరటి బాలవ్వ వారం రోజుల క్రితం మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలవ్వ కుమారుడు, చంద్రాయన్‌పల్లి ప్రస్తుత సర్పంచ్ అరటి రఘును ఓదార్చారు. పార్టీ పరంగా, వ్యక్తిగతంగా కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తమ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం మండవ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. అరటి బాలవ్వ సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రజల సంక్షేమం కోసం ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన వెంట మాజీ డైరెక్టర్లతో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు ఉన్నారు.

# నీటి వనరుల వృథాపై నిరంతర పర్యవేక్షణ

- చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరేలా చర్యలు
- అధికారులతో సమీక్షలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**




ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు వృథా కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం కలెక్టర్ భవేష్ మిశ్రాతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జలాశయాల్లో ఉన్న నీటి నిల్వల వివరాలను నీటిపారుదల శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోలిస్తే శ్రీరాంసాగర్‌తో పాటు ఇతర ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చుక్క నీరు కూడా వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని నిల్వ ఉంచుతూ పంటలను కాపాడేందుకు రెండు తడుల వరకు సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ జలాలు చివరి ఆయకట్టు వరకు చేరేలా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నెల రోజుల పాటు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని సూచించారు. నీటి నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశాల్లో ఏమాత్రం రాజీపడబోమని స్పష్టం చేశారు. నీటి వృథా కారణంగా పంటలు ఎండిపోతే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని తెలిపారు. నీటి వృథాను అరికట్టేందుకు అవసరమైన చోట కాలువలు, తూముల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను సమకూరుస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఖరీఫ్ పంట సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా గోదాముల్లో నిల్వ ఉన్న బియ్యాన్ని నిర్దేశిత ప్రాంతాలకు త్వరితగతిన తరలించాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను త్వరగా అందించాలని సూచించారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యమైన యూనిఫాంలను కుట్టి అందించే బాధ్యతను స్వయం సహాయక సంఘాలకు అప్పగించినందున, వాటిని సకాలంలో పూర్తి చేసేలా చూడాలని అన్నారు. సమీక్షలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా రెవెన్యూ అధికారి గీత, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, పౌరసరఫరాల శాఖ అధికారి అరవింద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కేజీబీవీ మహాధర్నాను జయప్రదం చేయాలి

- నాన్ టీచింగ్, వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి
- ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



తెలంగాణలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్ల వేతనాలు పెంచడంతోపాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. ఈ మేరకు మాక్లూర్ కేజీబీవీలో మహాధర్నా ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి సిబ్బంది వేతనాలను సమీక్షించాలని కోరారు. ఏళ్లుగా వేతనాలు పెరగకపోగా పని భారం మాత్రం పెరిగిందన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న సిబ్బందికి అదనంగా నైట్ డ్యూటీలు కేటాయించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రకటించిన కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అకౌంటెంట్లు, వర్కర్లకు నిబంధనలు, జాబ్‌చార్ట్‌కు విరుద్ధంగా ఇటీవల కేటాయించిన నైట్ డ్యూటీలను రద్దు చేయాలన్నారు. వర్కర్లకు వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హత కలిగిన నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ కల్పించాలని, రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచడంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. మూడేళ్లుగా అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను పరిష్కరించాలని విన్నవిస్తున్నా ఫలితం లేకపోవడంతో పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం కేజీబీవీల పట్ల మరింత కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద గురువారం నిర్వహించే మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కేజీబీవీల నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సుమలతతో పాటు కేజీబీవీ సిబ్బంది కావ్య, పద్మ, ప్రేమ, లక్ష్మి , వాసుకి, భారతి, సంతోషి, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

## అడవులు, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


**ఇందల్వాయి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



అడవులు, వన్యప్రాణులను సంరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఫారెస్ట్ ఆఫీసర్ రవి మోహన్ బట్ అన్నారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని చంద్రాయన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సౌమ్య నాయక్ తండాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం అడవుల సంరక్షణ, వన్యప్రాణుల రక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో అనంతరావు, గ్రామ సర్పంచ్ పురం సుదర్శన్ నాయక్‌తో పాటు అటవీ శాఖ అధికారులు, పంచాయతీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవి మోహన్ బట్ మాట్లాడుతూ.. ప్రకృతి ప్రసాదించిన అటవీ సంపద, వన్యప్రాణులను కాపాడుకోవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అటవీ సరిహద్దుల్లో భూములను అక్రమంగా ఆక్రమించడం, దున్నడం వంటి చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అడవుల్లో సంచరించే వన్యప్రాణులను వేటాడటం, వాటికి హాని కలిగించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. అటవీ సంరక్షణ నిబంధనలను ఉల్లంఘించే వారిపై అటవీ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి, జైలు శిక్షతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్ తరాల మనుగడకు, వర్షపాతానికి, పర్యావరణ సమతుల్యతకు అడవులు ఎంతో కీలకమని తెలిపారు. అటవీ శాఖ చేపడుతున్న సంరక్షణ చర్యలకు స్థానికులు, ప్రజాప్రతినిధులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు.

## ఎస్‌జీఎఫ్ పోటీల్లో శ్రీకృష్ణవేణి విద్యార్థుల ప్రతిభ

**చేగుంట, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



చేగుంట మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో మండలంలోని 10 పాఠశాలల జట్లు పోటీపడగా.. శ్రీకృష్ణవేణి పాఠశాల జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతలకు ఎంఈవో నీరజ, చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి-సతీష్ మెమెంటోలు, పతకాలు అందజేశారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదో తరగతి విద్యార్థులు సాయి విఘ్నేష్, రుతికేష్ జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపికయ్యారు. మెదక్ జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో నీరజ మాట్లాడుతూ విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల విద్యార్థులు కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించడంతో పాటు ఇద్దరు జిల్లా స్థాయికి ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ ద్యావ రేణుక లింగమూర్తి, డైరెక్టర్ నాగరాజు, పీఈటీ బాల్రాజ్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.

## నలందా మహిళా డిగ్రీ కళాశాలలో జేసీఐ వారోత్సవాలు



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

జేసీఐ ఇందూర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని నలందా మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జేసీఐ వారోత్సవాల్లో భాగంగా యువ నాయకత్వ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు తిరునగరి శ్రీహరి, మహిపాల్, తేజస్వీలు విద్యార్థినులకు యువ నాయకత్వం, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడంతో పాటు వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే విధానాలను వివరించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నలందా కళాశాల ప్రిన్సిపాల్ తాటిపాముల బాలకృష్ణ, జేసీఐ ఇందూర్ అధ్యక్షుడు జైపాల్ కాలె, పూర్వ అధ్యక్షులు కోటగిరి చంద్రశేఖర్, చింతల గంగాదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు

**కామారెడ్డి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

సమయస్ఫూర్తితో వ్యవహరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళతోపాటు ఆమె ఇద్దరు చిన్నారులను కాపాడారు. పోలీసుల వివరాల ప్రకారం.. చుక్కాపూర్‌కు చెందిన సంధ్యారాణి (30) వ్యక్తిగత కారణాలతో మనస్తాపానికి గురైంది. ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తెను పాఠశాల నుంచి ఇంటికి తీసుకెళ్లకుండా రైల్వే ట్రాక్ వద్దకు తీసుకెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. ఈ విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ కళ్యాణ్ , ఏఆర్‌పీసీ రామకృష్ణ వెంటనే రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకుని సంధ్యారాణితోపాటు ఇద్దరు చిన్నారులను సురక్షితంగా పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అనంతరం ఆమెకు కౌన్సెలించారు. ముగ్గురి ప్రాణాలను కాపాడిన కానిస్టేబుళ్లను పట్టణ సీఐ నరహరి అభినందించారు.

ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM
శుక్రవారం
సెప్టెంబర్ 11, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి



**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్‌తో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలి

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

జిల్లాలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీ గోడల పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. పూర్తయిన భవనాలను ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెంటనే ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీజీ రామ్) పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పథకం కింద జిల్లావ్యాప్తంగా మంజూరైన 82 గ్రామ పంచాయతీ భవనాలు, 55 అంగన్‌వాడీ భవనాలు, 8 గోదాముల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించి ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఈ పీఆర్ నర్సింలు, డీఆర్‌డీవో శ్రీనివాసరావు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, సీడీపీవోలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**చేగుంట, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని పురస్కరించుకుని చేగుంట మండల కేంద్రంలో గురువారం జై శ్రీరామ్ రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఉజ్జయిని మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ సంద్రుగు సతీష్, చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ, రజక సంఘం నాయకులు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

**సిర్నాపల్లిలో..**

**ఇందల్వాయి, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రజక సంఘం నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

**చేగుంట, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరవనిత చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను గురువారం చేగుంట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మండల రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఐత దివాకర్, గ్రామ రైతులు, మండల రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ విగ్రహం, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, కార్యదర్శి రవి, సంఘ సభ్యులు బాలేష్, విజయ్, సాదుల్లా, శరత్, సురేష్, సాయిబాబా, శ్రీధర్, నర్సింలు, ఆంజనేయులు, నవీన్, సంపత్, మల్లేష్, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భద్రత, చట్టాలపై షీ టీం అవగాహన

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని, భద్రతా ప్రమాణాలను పాటించాలని జిల్లా పోలీస్ షీ టీం సిబ్బంది సూచించారు. మెదక్ మండలం మంబోజిపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో గురువారం విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పొన్నం శ్రీనివాస్ రోడ్డు భద్రతా నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని, నిర్దేశిత వయస్సు వచ్చిన తర్వాతే డ్రైవింగ్ లైసెన్స్ పొంది వాహనాలు నడపాలని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు సైతం మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ప్రయాణాల్లో తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా షీ టీం బృందం బాలల హక్కులు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధం, ర్యాగింగ్ వ్యతిరేక చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. ఎవరైనా వేధింపులకు పాల్పడితే భయపడకుండా షీ టీంను ఆశ్రయించాలని సూచించింది. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, షీ టీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల బహుమతుల ప్రదానోత్సవం

**చేగుంట, సెప్టెంబరు 10 (ప్రజాశంఖారావం):**





చేగుంట మండల కేంద్రంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు గ్రామ సర్పంచ్ సంద్రుగు స్రవంతి–సతీష్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని అన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, తద్వారా నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని సూచించారు. ఎంఈవో నీరజ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించి జిల్లా స్థాయి పోటీల్లో చేగుంటకు ప్రథమ స్థానం తీసుకురావాలని ఆకాంక్షించారు. మండల ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారద విజేతల వివరాలను వెల్లడించారు. వాలీబాల్: అండర్–17 బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ వడియారం ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో స్పోర్ట్స్ స్కూల్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ ఇబ్రహీంపూర్ ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్–14 బాలురలో జడ్పీహెచ్‌ఎస్ ఇబ్రహీంపూర్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ వడియారం ద్వితీయ స్థానాల్లో నిలవగా.. బాలికల్లో జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ ఇబ్రహీంపూర్ ద్వితీయ స్థానాలు సాధించాయి. కబడ్డీ: అండర్–17 బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్ మక్కరాజుపేట్ ప్రథమ, శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల్లో జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ప్రథమ, కేజీబీవీ రెడ్డిపల్లి ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్–14 బాలురలో జడ్పీహెచ్‌ఎస్ మక్కరాజుపేట్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ద్వితీయ స్థానాల్లో నిలవగా.. బాలికల్లో స్పోర్ట్స్ స్కూల్ ప్రథమ, కేజీబీవీ రెడ్డిపల్లి ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఖో–ఖో: అండర్–17 బాలురలో జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ప్రథమ, గీత హైస్కూల్ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల్లో స్పోర్ట్స్ స్కూల్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ చేగుంట ద్వితీయ స్థానాలు సాధించాయి. అండర్–14 బాలురలో జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ రెడ్డిపల్లి ద్వితీయ స్థానాల్లో నిలవగా.. బాలికల్లో స్పోర్ట్స్ స్కూల్ ప్రథమ, జడ్పీహెచ్‌ఎస్ చందాయిపేట్ ద్వితీయ స్థానాలు సాధించాయి. కార్యక్రమంలో మక్కరాజుపేట్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటరామిరెడ్డి, చందాయిపేట్ హెచ్‌ఎం విట్టల్‌రెడ్డి, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్లా లక్ష్మణ్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు నాగరాజు, తపస్ మండల అధ్యక్షుడు రావుల వెంకటేష్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నరసింహారావు, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రావు, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి మణిరామ్, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి యాదగిరి, పీడీలు మంజులత, శంకర్, గిరిజ, రజిత, నరేష్, నవీన్, బాల్‌రాజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాంకులు రుణ లక్ష్యాలను వందశాతం సాధించాలి

- అర్హులైన వారికి రుణాలు సకాలంలో అందేలా చర్యలు
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**



జిల్లా ఆర్థికాభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన రుణ లక్ష్యాలను వందశాతం సాధించేందుకు బ్యాంకర్లు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. 2026 ఏప్రిల్–జూన్ మొదటి త్రైమాసికంలో జిల్లాలోని వివిధ రంగాలకు రూ.1,713.32 కోట్ల రుణాలు పంపిణీ చేసి, వార్షిక లక్ష్యంలో 24.33 శాతం సాధించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.936.80 కోట్లు, ఎంఎస్‌ఎంఈ రంగానికి రూ.316.31 కోట్లు, మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.144.28 కోట్లు, గృహ రుణాలకు రూ.4.46 కోట్లు, విద్యా రుణాలకు రూ.0.93 కోట్లు, ఇతర రంగాలకు రూ.441.10 కోట్ల రుణాలు అందించినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ద్వారా వచ్చిన రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. పీఎంఈజీపీ, పీఎం విశ్వకర్మ వంటి ఉపాధి కల్పన పథకాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. బ్యాంకింగ్ మోసాల నివారణకు కేవైసీపై ప్రజలకు అవగాహన కల్పించాలని, క్లెయిమ్ చేయని డిపాజిట్లను గుర్తించేందుకు 'ఉద్గమ్' పోర్టల్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. రుణాలు మంజూరు చేయడంతోపాటు వాటిని సకాలంలో తిరిగి వసూలు అయ్యేలా బ్యాంకర్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ బాపూజీ, ఆర్బీఐ ప్రతినిధి హేమలత, నాబార్డ్ డీడీఎం కృష్ణ చైతన్య, వివిధ బ్యాంకుల ఏజీఎంలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

సెప్టెంబరు 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావుతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే వేడుకలకు వేదిక నిర్మాణం, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు, జాతీయ పతాకావిష్కరణ నిబంధనల అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాపాలన దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ వేడుకల సందర్భంగా పోలీసు గౌరవ వందనం, పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవో రమాదేవి, డీఎఫ్‌వో జోజి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



**సామరస్యంతో వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలి**

వినాయక చవితి వేడుకలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా, సామరస్యపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, ఆర్డీవోలు రమాదేవి, బావయ్యలతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ మండపాల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారుల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసు యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం 'మట్టి గణపతిని పూజిద్దాం–పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' అనే నినాదంతో కలెక్టర్, ఎస్పీలు జిల్లా అధికారులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాల వినియోగాన్ని తగ్గించి జలవనరులను పరిరక్షించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, అగ్నిమాపక, ఆర్‌అండ్‌బీ, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫుట్‌పాత్ ఆక్రమణలపై మున్సిపల్ కొరడా

**మెట్‌పల్లి టౌన్, సెప్టెంబర్ 10 (ప్రజాశంఖారావం):**




ఫుట్‌పాత్‌లను ఆక్రమించి, రహదారులపై ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులను మున్సిపల్ అధికారులు తొలగించారు. మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాల మేరకు గురువారం ఈ చర్యలు చేపట్టారు. రహదారులపై బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు, పాదచారుల నడకకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో అధికారులు ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. రహదారులపై అడ్వర్టైజ్‌మెంట్ బోర్డులు, తోపుడు బండ్లు, పానీపూరీ బండ్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లు, రహదారులను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్ నాయక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ విష్ణు, ముజీబ్, నరేష్, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

శుక్రవారం
సెప్టెంబర్ 11, 2026
epaper.prajashankaravam.com
www.prajashankaravam.com
ప్రజా శంఖారావం
PRAJA SHANKARAVAM




# సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన

## స్వగత కృష్ణన్ ఇన్స్టాగ్రామ్ పోస్ట్

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ గాయని స్వగత కృష్ణన్ చేసిన ఇన్స్టాగ్రామ్ స్టోరీ ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పేరు ప్రస్తావించకుండా ఒక ప్రముఖ సంగీత దర్శకుడిపై ఆమె సంచలన ఆరోపణలు చేశారు. సదరు వ్యక్తి మహిళలపై లైంగిక దాడులు, బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ మరియు బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డాడని, అయినా ఇండస్ట్రీ అతని వెంటే నిలవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో ఓ స్టూడియోలో తనకు ఎదురైన లైంగిక వేధింపులు, సౌండ్ ప్రూఫ్ గదిలోని సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన ఉదంతాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ కారణాల వల్లనే తాను చెన్నై వదిలి రుషీకేష్ వెళ్ళినట్లు తెలిపారు. తీవ్ర ఆరోపణలు ఉన్నప్పటికీ సదరు వ్యక్తికి సినీ పరిశ్రమలో గౌరవం, మద్దతు లభించడంపై ఆమె విచారం వ్యక్తం చేశారు. అంతేకాకుండా, అతడు ప్రస్తుతం ఒక భక్తిరస చిత్రానికి సంగీతం అందిస్తున్నాడని, బహిరంగ వేదికలపై సన్మానాలు పొందుతున్నాడని పేర్కొంటూ ఇండస్ట్రీ ఎవరి పక్షాన నిలుస్తోందని ప్రశ్నించారు. "నెక్స్ట్.." అంటూ తన పోస్ట్‌ను ముగించడంతో, త్వరలోనే ఆమె మరిన్ని విషయాలను, ఆధారాలను బయటపెట్టబోతున్నారా అనే ఉత్కంఠ నెటిజన్లలో నెలకొంది.

# అతన్ని ప్రేమించిమోసపోయా..

విలక్షణ నటిగా గుర్తింపు తెచ్చుకుని దక్షిణాదిలోని అన్ని భాషల్లో సత్తా చాటుతున్నారు ఐశ్వర్య లక్ష్మీ. నటనే కాదు ఏ విషయంపై అయినా కుండబద్ధలు కొట్టినట్లు మాట్లాడటం ఆమె స్టైల్. ఎవరు ఏమనుకున్నా సరే తన మనసులో ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడతారు ఐశ్వర్య. కొద్దిరోజుల క్రితం పెళ్లి, సహజీవనం విషయంలో ఆమె మాట్లాడిన మాటలు హాట్ టాపిక్‌గా మారాయి. తాజాగా రిలేషన్‌పై ఐశ్వర్య చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. కేరళకు చెందిన ఐశ్వర్య లక్ష్మీ.. మెడిసిన్ చదువుకున్నారు. అయితే డాక్టర్ కాకుండా యాక్టింగ్ వైపు వచ్చారు. అప్పటికే మోడలింగ్ చేస్తూ పలు టాప్ బ్రాండ్స్‌కు సంబంధించిన వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 2017లో నవిన్ పౌలే సరసన నటించే అవకాశం ఐశ్వర్యకు దక్కింది. ఈ సినిమాలో ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో పాటు మలయాళ, తమిళ భాషల్లో అనూహ్యంగా బిజీ అయ్యారు. మాయానంది, వారాతన్, పొన్నియన్ సెల్వన్, అమ్ము, కుమారి, గట్టా కుస్తీ, హలో మమ్మీ, మామన్ సినిమాలతో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. సత్యదేవ్ హీరోగా వచ్చిన గాడ్సే మూవీ ద్వారా తెలుగు వారిని పలకరించారు ఐశ్వర్య లక్ష్మీ. ఈ ఏడాది తమిళంలో గట్టా కుస్తీ 2 సినిమాతో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రస్తుతం సాయిధరమ్ తేజ్ సరసన సంబరాల ఏటి గట్టు, మలయాళంలో ఆశా సినిమాలలో ఆమె నటిస్తున్నారు. సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉండే ఐశ్వర్య.. తన సినిమాలు, షూటింగ్స్, ఇతర వ్యక్తిగత వివరాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. 35 ఏళ్లు దాటి 40వైపు చేరుకుంటున్నా ఇంకా పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్‌గానే ఎంజాయ్ చేస్తున్నారు ఈ ముద్దుగుమ్మ. పలుమార్లు ఐశ్వర్య లక్ష్మీ ప్రేమలో పడినట్లుగా రూమర్స్ రాగా.. వాటిని ఆమె ఖండించారు. నేను సింగిల్‌గా చాలా హ్యాపీగా ఉన్నాను.. నన్ను డబుల్ చేసేందుకు ప్రయత్నించొద్దని ఫ్యాన్స్‌పై విరుచుకుపడింది ఐశ్వర్య. జీవితంలో నేను పెళ్లి చేసుకోను.. ఎంతోమంది సన్నిహితులను చాలా దగ్గరి నుంచి చూశా. పెళ్లి కారణంగా కలల్ని చంపుకుని, వ్యక్తిగతంగానూ వారు ఎదగలేకపోతున్నారు. ఇవన్నీ చూసి, ఆలోచించి జీవితంలో పెళ్లి చేసుకోకూడదని నిర్ణయించుకున్నాను. సంతోషకరమైన జీవితాన్ని గడపటానికి పెళ్లి అనేది తప్పనిసరి కాదు. పెళ్లి చేసుకుని విడిపోవడం కంటే, సహజీవనం బెస్ట్ అని ఐశ్వర్య లక్ష్మీ బోల్డ్ కామెంట్స్ చేశారు. తాజాగా ఓ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన పెళ్లి, ప్రేమపై ఐశ్వర్య లక్ష్మీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నేను గతంలో ఓ రిలేషన్‌లో మోసపోయా, స్వతహాగా నేను ఆకర్షణలకు లొంగను, అలాంటి ఓ వ్యక్తిని పూర్తి నమ్మి అతని చేతిలో మోసపోయా. ఈ రిలేషన్ ముగిసిన తర్వాతే నా చుట్టూ ఏం జరుగుతుందో తెలుస్తోంది. ఓ మహిళ నన్ను కలిసిన తర్వాతే అతని మోసం బయటపడింది. ఇందులో తన తప్పు లేకపోవడం వల్లే ఆమెపై నాకెలాంటి కోపం రాలేదు. ఈ విషయం గురించి రెండు రోజులు మాత్రమే బాధపడ్డా.. ఆ తర్వాత దానిని మరిచిపోయానని ఐశ్వర్య లక్ష్మీ పేర్కొన్నారు.



# ఫ్యామిలీతో కలిసి చూడదగ్గ మూవీ మందాడి



సూరి, సుహాస్ మెయిన్ లీడ్స్ గా తెరకెక్కిన తమిళ్ సినిమా 'మందాడి'. ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ పై ఎల్రెడ్ కుమార్ నిర్మాణంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. ఈ సినిమాలో మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటించగా.. సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్.. పలువురు కీలక పాత్రలను పోషించారు. మందాడి సినిమా నేడు సెప్టెంబర్ 10న తమిళ్, తెలుగులో రిలీజ్ అయింది. కళింగపట్నంను సట్టపులి(సుహాస్) రూల్ చేస్తూ ఉంటాడు. ఆ ఊళ్ళో సముద్రంలో జరిగే పడవపోటీలు ఎన్నో ఏళ్లుగా చాలా ఫేమస్. 20 ఏళ్లుగా సట్టపులి సునామి రైడర్స్ టీమ్ తో ఆ ఊరిని గెలిపిస్తూ ఉంటాడు. శ్రీను(రవీంద్ర విజయ్) కొడుకు మల్లేష్(మిథున్ జై శంకర్) పడవల పోటీకి సంబంధించిన ఓ విషయంలో గొడవ జరిగి సట్టపులి కొడుకుపై దాడి చేస్తాడు. అది మిస్ అవ్వడంతో ఓ అమ్మాయి సాయంతో హైదరాబాద్ లో ఉన్న ముత్తు కాళీ(సూరి) దగ్గర తలదాచుకుని ఉంటాడు. ముత్తుకాళీ పెళ్లి చేసుకోకుండా సింగిల్ గా ఉంటూ ఓ స్విమ్మింగ్ పూల్ లో పనిచేస్తూ ఉంటాడు. కానీ సట్టపులి మనుషులు మల్లేష్ ని చంపడానికి అక్కడికి కూడా రావడంతో 20 ఏళ్లుగా ఊరికి వెళ్లని ముత్తుకాళీ మల్లేష్ ని తీసుకొని ఊరికి వస్తాడు. అక్కడ పెద్దలు సట్టపులికి ముత్తుకాళీ మధ్య రాజి కుదర్చాలని ట్రై చేసినా అక్కడ పెద్ద గొడవ అవుతుంది. దాంతో కళింగపట్నం నుంచి రెండు టీమ్స్ పోటీ చేయాలి ఎవరు ఓడిపోతే వాళ్ళు ఆటని వదిలేయాలి అని నిర్ణయిస్తారు. పోటీకి కొన్ని రోజులు సమయం ఉండటంతో కొత్తవాళ్లకు ముత్తుకాళీ తన కళింగ వారియర్స్ టీమ్ గా ట్రైనింగ్ ఇస్తూ ఉంటాడు. సట్టపులి, అతని కొడుకు పోటీ ఎలాగైనా గెలవాలని కుట్రలు పన్నుతూ ఉంటారు. ఓ ప్రాక్టీస్ మ్యాచ్ లో ముత్తుకాళీ టీమ్ పడవ బోల్తా పడి పోటీలో ఉన్నవాళ్లు హాస్పిటల్ పాలవుతారు. దీంతో కళింగ వారియర్స్ కి పోటీల్లో ఎలా పాల్గొనాలో అర్థం కాదు. మరోవైపు 20 ఏళ్ళ క్రితం ముత్తుకాళీ ఒకప్పుడు తన తల్లి ఏంజిల్ (మహిమా నంబియార్)ని ప్రేమించిన వ్యక్తి అని తెలిసి మల్లేష్ ముత్తుకాళీ పై కోపంగా ఉంటాడు. అసలు 20 ఏళ్ళ క్రితం ఆ ఊళ్ళో ఏం జరిగింది? బెస్ట్ ఫ్రెండ్స్ గా ఉండే సట్టపులి -- ముత్తుకాళీ శత్రువులు ఎలా అయ్యారు? ఏంజిల్ -- ముత్తుకాళీ ప్రేమ ఎందుకు విఫలమైంది? పోటీలో గెలవడానికి సట్టపులి చేసే కుట్రలు ఏంటి? ఫైనల్ పోటీలో ముత్తుకాళీ టీమ్ గెలుస్తుందా? సముద్రంలో జరిగే సంఘటనలు ఏంటి.. ఇవన్నీ తెలియాలంటే తెరపై చూడాల్సిందే.

# 'సీక్రెట్ సోల్జర్' నుంచి సాంగ్ రిలీజ్




నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా తెరకెక్కుతున్న సినిమా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో స్పై డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతుంది. కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్.. పలువురు ఈ సినిమాలో కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజయిన సాంగ్స్, టీజర్, ట్రైలర్స్ అంచనాలు పెంచగా తాజాగా ఈ సినిమా నుంచి ఓయ్ ఓయ్.. అంటూ సాగే సాంగ్ ని రిలీజ్ చేశారు. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీత దర్శకత్వం అందిస్తూ రెహమాన్ రాసిన ఈ సాంగ్ ని కార్తీక్ స్వయంగా పాడాడు. ఈ సినిమా సెప్టెంబర్ 18న థియేటర్స్ లో రిలీజ్ కానుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PUTTI MURALI, PRINTED AT INDUR OFFSET PRINTERS, OPP : CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR,NIZAMABAD- 503001, NIZAMABAD DISTRICT, TELANGANA STATE, PUBLISHED AT HNO.1-86/10/05, KOTARMOOR(PERKIT), ARMOOR-503224, NIZAMABAD DISTRICT, TELANGANA STATE. EDITOR : PUTTI MURALI, TELTEL/2022/85170, EMAIL :prajashankaravam@gmail.com